




APTEL RNI NO: 62061/2015

# వార్తావళి

తెలుగు దినపత్రిక








విశాఖపట్నం : మంగళవారం 22 సెప్టెంబర్ 2020 | ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం | VAARTAVALI TELUGU DAILY | పేజీలు : 8 | రూ. 1.00 | సంపుటి 5 | సంచిక 212


## పోలీసులను సేవకులుగా గుర్తించాలి



**తాడేపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 21 :** పోలీసులంటే భయపడాల్సిన అవసరం లేదని.. వారిని సేవకులుగా ప్రజలు గుర్తించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పోలీసు సేవలను మరింత చేరువ చేసేందుకే సరికొత్త యాప్ రూపొందించినట్లు సీఎం వెల్లడించారు. సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ దిశగా ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా ఏపీ పోలీస్ శాఖ సరికొత్త సేవా యాప్‌ను సీఎం వైఎస్ జగన్ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 87 సేవలను యాప్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. యాప్ ద్వారా పోలీస్ స్టేషన్లకు వెళ్లే పరిస్థితులు బాగా తగ్గించగలిగామని, పోలీసులు అందించే సేవలను ఒకే ఫ్లాట్‌ఫామ్ పైకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. దర్యాప్తు పురోగతి, అరెస్ట్‌లు, ఎఫ్ఐఆర్‌లు, రికవరీలు, రహదారి భద్రత, సైబర్ భద్రత, మహిళా భద్రత, వివిధ కార్యక్రమాలకు అనుమతులు, ఎన్‌వోసీలు, లైసెన్సులు, పాస్‌పోర్ట్ సేవలు, ఇతర వెరిఫికేషన్లు అన్ని పోలీసు సేవలను యాప్ ద్వారా పొందవచ్చన్నారు. ఫిర్యాదు చేసినప్పటి నుంచి ఏ దశలో కేసు ఉందో తెలుసుకోవచ్చని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరాన్ని ఈ యాప్ తగ్గిస్తోందని, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సీఎం సూచించారు. ఈ యాప్ తీసుకొచ్చిన రాష్ట్ర పోలీస్‌శాఖకు సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు.

**దేశంలోనే తొలిసారి.. ఏపీ పోలీస్ సరికొత్త యాప్**

పాలనలో ఇప్పటికే అనేక సంస్కరణలు తీసుకువచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర పోలీస్ శాఖ సరికొత్త యాప్‌ను పరిచయం చేసింది. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లను అనుసంధానిస్తూ రూపొందించిన కొత్త యాప్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే అవసరం లేకుండా 87 రకాల సేవలు అందుబా టులోకి రానున్నాయి. అన్ని నేరాలపై ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశంతోపాటు ఫిర్యాదు లకు రశీదు కూడా పొందే అవకాశం ఉంది. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా ఫిర్యాదులతో పాటు అత్యవసర సమయాల్లో వీడియో కాల్ చేసే సౌకర్యం కూడా ఉంది. ముఖ్యంగా మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా 12 రకాల సేవలు అందు బాటులోకి రానున్నాయి. దర్యాప్తు పురోగతి, అరెస్ట్ లు, ఎఫ్ఐఆర్‌లు, రికవరీలు, రహదారి భద్రత,.. సైబర్ భద్రత, మహిళా భద్రత, వివిధ కార్యక్రమా లకు అనుమతులు కూడా ఈ యాప్ ద్వారా పొంద వచ్చు. వీటితో పాటు ఎన్‌వోసీలు, లైసెన్సులు, పాస్‌పోర్ట్ సేవలు, ఇతర వెరిఫికేషన్లు అన్ని పోలీసు సేవలను కూడా అందుబాటులో ఉంటాయి.

(మిగతా 6వ పేజీలో)



## ఏపీలో మోగిన బడిగంట ...

### తొలిరోజు స్కూలుకు విద్యార్థులు .. కరోనా మార్గదర్శకాలతోనే క్లాసులు

**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 21 :** కరోనా మహమ్మారి కారణంగా ఆరు నెలల పాటు సుదీర్ఘ విరామం తీసుకున్న ఏపీలోని పాఠశాలలు, కళాశాలలు నేటి నుండి తిరిగి ప్రారంభం అయ్యాయి. బడిగంట మోగిన వేళ కరోనా నిబంధనలు పాటిస్తూ క్లాసులు నిర్వహించనున్నారు ఏపీ లోని పాఠశాలల నిర్వాహకులు. సామాజిక దూరాన్ని పాటిస్తూ, మాస్కులు ధరించి, శానిటైజేషన్ చేయగా నేడు పలువురు విద్యార్థులు క్లాసులకు హాజరు అయ్యారు. అన్ లాక్ 4.0 లో భాగంగా తొమ్మిదో తరగతి నుండి 12వ తరగతి వరకు క్లాసుల నిర్వహణకు కేంద్రం అనుమతి ఇవ్వడంతో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇక కరోనా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కేంద్రం స్పష్టం చేసింది. దీంతో ఆరు నెలల తర్వాత తెలుగు రాష్ట్రాల్లో స్కూళ్లు కాలేజీలు పునః ప్రారంభమయ్యాయి. దీంతో కొంత మంది విద్యార్థులు ఉత్సాహంగా స్కూల్‌కి వస్తే, చాలా మంది విద్యార్థులను కరోనా భయంతో తల్లిదండ్రులు పాఠశాలలకు పంపించని పరిస్థితి ఉంది. కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలలో భాగంగా తల్లిదండ్రుల అనుమతితోనే స్కూల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ఒకవేళ తల్లి దండ్రులు తమ పిల్లల్ని స్కూల్ కు పంపించవద్దని నిర్ణయించుకుంటే వారికి ఆన్లైన్ ద్వారా తరగతులు వినే ఆప్షన్ ను ప్రభుత్వం కల్పిస్తుంది. ఇంటర్మీడిట్ కళాశాలలలో కూడా ఇదే విధానాన్ని అనుసరించనున్నట్లుగా తెలుస్తుంది. ఏపీ విద్యాశాఖ గైడెన్స్ ప్రకారం కరోనా నిబంధనలు పాటిస్తూ తొమ్మిదవ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థులకు నేడు స్కూల్స్ ప్రారంభమయ్యాయి. కరోనా కన్టైన్మెంట్ జోన్స్ లో తప్ప మిగతా అన్ని ప్రాంతాలలోనూ నేడు స్కూల్స్ తెరుచుకున్నాయి. స్కూల్ గదులను, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటుగా, ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది అందరూ సామాజిక దూరం పాటిస్తూ తరగతులను నిర్వహించాల్సి ఉంటుంది.



(మిగతా 8వ పేజీలో)

## సెప్టెంబర్ 25న బంద్

### విపక్షాలతో కలిసి ఫైట్‌కు సిద్ధమవుతున్న కాంగ్రెస్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా ఇప్పటికే పలు రైతు సంఘాలు 'భారత్ బంద్'కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 25న జరగనున్న ఈ బంద్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్,విపక్షాలు నిరసన కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంది. ఈ మేరకు ఇప్పటికే ఏఐసీసీ నుంచి ప్రదేశ్ కమిటీలకు సూచనలు వెళ్లాయి. ముఖ్యంగా పంజాబ్,హర్యానా రాష్ట్రాల్లో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేసేలా కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. రైతు చేతికి అధికారం: మద్దతు ధర కొనసాగింపు: వ్యవసాయ బిల్లులపై మోదీ హర్షం – ఆ ఎంపీలపై చర్యలు? నిరసన కార్యక్రమాలపై ఇప్పటికైతే కాంగ్రెస్,విపక్ష పార్టీల నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే పంజాబ్,హర్యానా రాష్ట్రాల్లోని రైతు సంఘాలు ఇప్పటికే నిరసనలను ఉధృతం చేశాయి. ఈ నేపథ్యంలో రైతులతో కలిసి కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ఈ క్రమంలో విపక్ష పార్టీలన్నీ ఏక తాటి పైకి వచ్చి కేంద్రానికి నిరసన తెలిపే అవకాశం ఉంది. కేంద్రం తీసుకొచ్చిన రైతు ఉత్పత్తుల వాణిజ్య, వ్యాపార(ప్రోత్సాహక, సులభతర) బిల్లు, నిత్యవసర సరకుల(సవరణ) బిల్లు,రైతుల (సాధికారత, రక్షణ) ధర హామీ, సేవల ఒప్పంద బిల్లు–2020 బిల్లులు లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. లోక్‌సభలో సులువుగా గట్టెక్కిన ఈ బిల్లులకు రాజ్యసభలో మాత్రం గట్టి సవాల్ ఎదురైంది. అయినప్పటికీ విపక్ష సభ్యుల ఆందోళన నడుమే మూజువాణి ఓటు ద్వారా బిల్లులు పాస్ అయినట్లు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ ప్రకటించారు. అయితే ప్రజాస్వామిక విలువలను, సభా నియా మాలను ఉల్లంఘించేలా హరివంశ్ సింగ్ నారాయణ్ వ్యవహరించారని ఆరోపించారు.



### పాఠకులకు విజ్ఞప్తి

www.vaartavali.com వెబ్‌సైట్‌లో **వార్తావళి** దినపత్రిక ఇంటర్నెట్ పేపర్ వస్తుందని చెప్పడానికి వార్తావళి దినపత్రిక యాజమాన్యం తెలియపరుస్తున్నది. ఈ అవకాశాన్ని పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాము.

## కాపు నేతల అభీష్టాన్ని మన్నించలేను: ముద్రగడ



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 21 :** ఉద్యమ సారథ్యం చేపట్టాలని కాపు నేతల కోరికను తాను మన్నించలేనందుకు క్షమించాలని ముద్రగడ కోరారు. అందరి ఇంటిలో సభ్యునిగా ఉంటా. ఏ కార్యక్రమం వున్నా ఓపిక ఉన్నంత వరకు వస్తాను అంటూ ముద్రగడ తనదయిన శైలిలో కిర్లంపూడి తన నివాసంలో లేఖ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి కాపు ఉద్యమకారుడు ఆకుల రామకృష్ణతో పాటు 13 జిల్లాల కాపు ఉద్యమ ముఖ్య నేతలతో (జే ఏ సి), కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం చెముడులంక (గాంధీనగరం) గ్రామానికి చెందిన నైనాల హరిశ్చంద్రప్రసాద్ హాజరయ్యారు.

## జిల్లా ఆస్పత్రుల్లో శిక్షణ తప్పనిసరి



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 21 :** మెడికల్ విద్యార్థుల విషయంలో కేంద్ర సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. వైద్యవిద్య పీజీలో ఎండి, ఎంఎస్ చదివే వైద్య విద్యార్థులంతా ఇకపై రెండవ సంవత్సరం నుండి జిల్లా ఆసుపత్రులలో శిక్షణ తీసుకోవడం తప్పనిసరి అని గెజిట్ విడుదల చేసింది కేంద్ర సర్కార్ . తాజాగా పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ సవరణ నిబంధనలు 2020 కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఏపీలో మెడికల్ కాలేజీల నిర్మాణానికి జగన్ సర్కార్ మరో కీలక అడుగు ..2050 కోట్ల నిధులు ఇప్పటిదాకా మెడికల్ పీజీ విద్యార్థులు టీచింగ్ ఆస్పత్రిలోనే శిక్షణ పొందే వారు. అయితే ఈ సవరణ నిబంధన ద్వారా మెడికల్ పీజీ విద్యార్థులు కచ్చితంగా జిల్లా ఆస్పత్రిలో శిక్షణ పొందాలి. దీనివల్ల జిల్లా ఆస్పత్రిలో స్పెషలిస్టు వైద్య సేవలు పూర్తిగా అందుబాటులోకి వస్తాయని, వైద్య సిబ్బంది కొరత తీరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. క్షేత్రస్థాయిలో వ్యాధులపై అవగాహన రావడంతో పాటుగా, దీనివల్ల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. వంద పడకలకు తక్కువకాకుండా ఉన్న జిల్లా ఆసుపత్రులలో మెడికల్ పీజీ విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. ఈ సంవత్సరం పీజీలో చేరిన వారికి వచ్చే సంవత్సరం నుండి ఈ శిక్షణ అమలు కానుంది. ఇప్పటివరకు పీజీ విద్యార్థులు టీచింగ్ ఆసుపత్రులలో శిక్షణ పొందుతుండగా, అక్కడ జిల్లా ఆసుపత్రులతో పోల్చి చూస్తే, తక్కువ మంది పేషెంట్స్ ఉన్నట్లుగా గుర్తించారు. అందుకే జిల్లా ఆసుపత్రులలో శిక్షణ ఇవ్వడం వారికి ఉపయోగపడటమే కాకుండా, ప్రభుత్వానికి కూడా డాక్టర్ల కొరత తగ్గించినట్లు అవుతుందని ఈ నిర్ణయం తీసుకున్నారు.

## అక్టోబర్ 5 నుంచి రోజువారీ విచారణ - ఏపీ హైకోర్టు

మూడు రాజధానులు, సీఆర్డీఏ వ్యవహారంపై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. స్టేటస్ కోను వచ్చే నెల (అక్టోబర్) 5 వరకు హైకోర్టు పొడిగించింది. తదుపరి విచారణను అక్టోబర్ 5కు వాయిదా వేసింది. ప్రస్తుతం రాజధానిపై ఉన్న స్టేటస్‌కో అక్టోబర్ 5వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీచేసింది. వచ్చేనెల 5నుంచి రోజువారీ విచారణ జరుపుతామని ఏపీ హైకోర్టు తెలియజేసింది. రాజధాని బిల్లులలు అమలు చేయకుండా స్టేటస్కో కొనసాగుతందని ధర్మాసనం తెలిపింది. ఏపీ హైకోర్టు స్టేటస్కోను ఇప్పటి వరకు రెండుసార్లు పొడిగిచింది. ఆగస్టు నెలలో రాజధానుల పిటిషన్లపై విచారణ జరిపిన కోర్టు కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి సెప్టెంబర్ 11 వరకు సమయం ఇచ్చింది.. అలాగే అభ్యంతరాలు చెప్పేందుకు సెప్టెంబర్ 17 వరకు గడువు ఇచ్చారు. సెప్టెంబర్ 21 నుంచి రోజూ విచారణ జరుపుతామని తెలిపింది. మరోవైపు మూడు రాజధానుల అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. హైకోర్టు విచారణ చేస్తున్నందున ఈ దశలో జోక్యం చేసుకోలేమంది. మూడు రాజధానుల అంశంపై హైకోర్టులో విచారణ ఉందని.. తమ వద్దకు రావడం సరికాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈకేసును హైకోర్టు త్వరగా పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. స్టేటస్ కోపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో ఈ పిటిషన్లపై విచారణ హైకోర్టులోనే జరుగుతోంది.

## సంక్రాంతి రైళ్లన్నీ ఫుల్...!



**విజయవాడ, వార్తావళి, సెప్టెంబర్ 21 :** సంక్రాంతి పండగకు కొత్తగా వేసిన ప్రత్యేక రైళ్లల్లో బెర్తులన్నీ నిండుకున్నాయి. ఒకవైపు కరోనా వ్యాప్తి రోజురోజుకూ పెరుగుతున్నా ప్రయాణికులు ఏ మాత్రం లెక్క చేయడం లేదు. సాధారణ రోజుల్లో రద్దీ ఉన్న విధంగానే వచ్చే ఏడాది సంక్రాంతి పండగకు బెర్తులను రిజర్వేషన్ చేసేసుకున్నారు...! విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే అన్ని ప్రత్యేక రైళ్లల్లో బుకింగ్‌లు ప్రారంభించిన నిముషాల వ్యవధిలోనే టికెట్లు పూర్తయి, వెయిటింగ్ లిస్టుకు చేరుకోవడం విశేషం. మరికొన్ని రైళ్లల్లో నోరూమ్‌లు దర్శనమిస్తున్నాయి...! విశాఖపట్నం, విజయనగరం మార్గాల్లో నడిచే రైళ్లల్లో వెయిటింగ్ లిస్టులు భారీగా ఉన్నాయి. సికింద్రాబాద్ వైపు కూడా ఇదే పరిస్థితి ఉంది. పండగకు 120 రోజుల మందుగా ముందస్తు రిజర్వేషన్ చేయించుకునే అవకాశం ఉండడంతో...గత వారం రోజులుగా ప్రయాణికులు రైల్వే రిజర్వేషన్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు...! బుకింగ్‌లు ప్రారంభించిన వెంటనే టికెట్లు పూర్తయి వెయిటింగ్ లిస్టుకు చేరుకోవడంతో ప్రయాణికులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. నగరంలోని అన్ని రైల్వే రిజర్వేషన్ కేంద్రాలతో పాటు ఐఆర్‌సీటీసీ కేంద్రాల వద్ద కూడా ప్రయాణికుల రద్దీ ఏర్పడింది. రిజర్వేషన్లు పూర్తవడంతో ప్రయాణికులు తాత్కాల్ టికెట్లపైనే ఆశలు పెట్టుకున్నారు...! రద్దీ దృష్ట్యా హౌరా, సికింద్రాబాద్, బెంగళూరు మార్గాల్లో మరిన్ని ప్రత్యేక రైళ్లు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. రానున్న రోజుల్లో వైరస్ తగ్గుముఖం పడితే సాధారణ రైళ్లను యథాతథంగా నడపాలని రైల్వే శాఖ యోచిస్తోంది...!

## జీఎస్టీ లోటు భర్తీకి 21 రాష్ట్రాలు కీలక నిర్ణయం !




దేశంలో కరోనా మహమ్మారి విజృంభణ నేపథ్యంలో ఏర్పడిన జీఎస్టీ లోటు భర్తీకి సంబంధించి దేశంలో ఉన్న 21 రాష్ట్రాలు కీలక నిర్ణయాన్ని తీసుకున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించిన ఆప్షన్ 1 ను ఎంచుకున్నాయని అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది జీఎస్టీ ప్రతిపాదించిన రుణాలు తీసుకోవడానికే ఈ రాష్ట్రాలు నిర్ణయం తీసుకున్నాయి. దీని ద్వారా ఆర్థిక మంత్రిత్వ శాఖ సమన్వయంతో ఒక ప్రత్యేక విండో కింద రుణాల ద్వారా 97000 కోట్ల అంచనా లోటును అప్పుగా తీసుకోవడానికి వీలు కల్పిస్తుందని తెలిపారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు అందించిన వివరాల ప్రకారం...ఈ నిర్ణయం తీసుకున్న వాటిల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న పాండిచేరి కూడా ఓ రాష్ట్రం కావడం విశేషం. ఇక ఆంధ్రప్రదేశ్ అరుణాచల్ ప్రదేశ్ అసోం బీహార్ గోవా గుజరాత్ హర్యానా హిమాచల్ ప్రదేశ్ జమ్మూ కశ్మీర్ కర్ణాటక మధ్యప్రదేశ్ మణిపూర్ మేఘాలయ మిజోరాం నాగాలాండ్ ఒడిశా ఉత్తరాఖండ్ ఉత్తరప్రదేశ్ ఉన్నాయి. దీనికి సంబంధించి ఇతర కాంగ్రెస్ లేదా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు తమ నిర్ణయాన్ని ప్రకటించలేదని వెల్లడించాయి. అలాగే మిగిలిన రాష్ట్రాలు అక్టోబరు 5న జరగనున్న కౌన్సిల్ సమావేశాని కంటే ముందు తమ నిర్ణయాన్ని తెలియజేయాల్సి ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. లేదంటే బకాయిల కోసం జూన్ 2022 వరకు వేచి ఉండాల్సి ఉంటుందని స్పష్టం చేశాయి. కాగా జీఎస్టీ అమలు ద్వారా రాష్ట్రాలు నష్టపోతున్న మొత్తం 97000 కోట్లుగా లెక్కించాం. ఆ మొత్తాన్ని రాష్ట్రాలు కేంద్ర ఆర్థికశాఖ ఏర్పాటు చేసిన స్పెషల్ విండో ద్వారా రుణం రూపంలో పొందవచ్చు అని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభ లో వెల్లడించారు. కరోనా మహమ్మారి నష్టాన్ని కలుపుకుంటే మొత్తం లోటు రూ. 235000 కోట్లుగా లెక్కించామనీ ఈ మొత్తాన్ని రాష్ట్రాలు మార్కెట్ నుంచి రుణాలు పొందడం రెండో ఆప్షన్ గా తెలిపారు. ఈ రుణం తిరిగి కేంద్రం చెల్లిస్తుందని కానీ వడ్డీని రాష్ట్రాలే భరించాల్సి ఉందన్నారు. రాష్ట్రాలు ఈ రెండు విధానాల్లో ఏదైనా ఎంచుకోవచ్చనీ 41వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కూలంకుషంగా చర్చించామనీ ఆమె తెలిపారు. రాష్ట్రాలకు రెండు ఆప్షన్స్ ఇచ్చామని ఆర్థికమంత్రి ప్రకటించిన సంగతి తెలిసిందే.


### విలేకరులు కావలెను

'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు పశ్చిమగోదావరి, అనంతపురం, విశాఖ పశ్చిమం, తూర్పు, పాడేరు, అరకు ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా జిల్లా ఇన్‌చార్జ్‌లుగా కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

7032034001, 8500159006

త్వరలో 'వార్తావళి' తెలుగు దినపత్రిక యూ ట్యూబ్ చానల్ ప్రారంభమవుతుంది. ఎపిలో వివిధ జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావెలెను.
యూ ట్యూబ్ చానల్‌లో పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను.
bulusu333@gmail.com
మెయిల్‌కి తమ బయోడాటా పంపించగలరు. 8500159006 నెంబరుకు సంప్రదించగలరు

YouTube

# జాతీయం-అంతర్జాతీయం

## రోజుకు 5,000 మందికి మాత్రమే అనుమతి



**ఢిల్లీ:** ప్రపంచ ప్రఖ్యాత కట్టడం తాజ్‌మహల్ సోమవారం నుంచి పర్యాటకులకు అందుబాటులోకి వచ్చింది. కరోనా వైరస్ ప్రభావం ఈ పర్యాటక స్థలంపై కూడా పడటంతో, మార్చి 17న మూసివేశారు. కాగా, ఇప్పటి వరకు 160 టికెట్లు బుక్ అయ్యాయని, భారత్‌లో ఉంటున్న తైవాన్ పర్యాటకుడు మొదటి సందర్శకుడని పురావస్తు శాఖ అధికారులు వెల్లడించారు. భారత పురావస్తు శాఖ(ఏఎస్‌ఐ) అధికారులు మాట్లాడుతూ..'ఆరు నెలలుగా సందర్శకులకు అనుమతి లేకున్నా, తాజ్ మహల్ నిర్వహణను కొనసాగించాం. సందర్శనకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో..కొవిడ్ కట్టడి చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయనున్నాం. దానిలో భాగంగా ప్రతి పర్యాటకుడి ఉష్ణోగ్రతను పరిశీలించడంతో పాటు శానిటైజర్ అందించనున్నాం. అలాగే రెండు స్లాట్లుగా మొత్తం 5,000 మందిని అనుమతించనున్నాం. ఒక్కోస్లాటుకు గరిష్టంగా 2,500 మందికి అనుమతి ఉంటుంది' అని వెల్లడించారు. అలాగే ఆన్‌లైన్, కోడ్ స్కానింగ్ ద్వారానే టికెట్లు కొనుగోలు చేయాల్సి ఉంటుందని, అందుకోసం ఏఎస్‌ఐ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తక్షణ వైద్య సేవల నిమిత్తం అంబులెన్స్ సేవలను సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. అయితే, ఇంత ఎక్కువ కాలం తాజ్‌మహల్‌ను మూసివేసిన సందర్భాలు లేవని పర్యాటక రంగానికి చెందిన నిపుణులు అంటున్నారు. అలాగే అన్నీ సజావుగా సాగేలా ఏఎస్‌ఐ అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం కూడా అంతర్జాతీయ విమానాలు నడిపే అంశంపై యోచించాలని వారు కోరుతున్నారు. కరోనాతోనే సహజీవనం చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

## రాజ్యసభలో 8 మంది ఎంపీలపై సస్పెన్షన్ వేటు

### డిప్యూటీ ఛైర్మన్‌పై ఇచ్చిన అవిశ్వాస నోటీసును తోసిపుచ్చిన ఛైర్మన్



**ఢిల్లీ:** వ్యవసాయ బిల్లుల ఆమోదం సందర్భంగా ఆదివారం రాజ్యసభలో చోటుచేసుకున్న గందరగోళ పరిస్థితుల పట్ల ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బిల్లుల్ని నిబంధనలకు విరుద్ధంగా ఆమోదింపజేశారంటూ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సింగ్‌పై విపక్షాలు ఇచ్చిన అవిశ్వాస నోటీసును తోసిపుచ్చారు. సభా నియమాల ప్రకారం డిప్యూటీ ఛైర్మన్‌పై అవిశ్వాసం ఆమోదనీయం కాదన్నారు. బిల్లుల చర్చ, ఓటింగ్ సమయంలో నిన్న విపక్ష ఎంపీలు వ్యవహరించిన తీరును ఛైర్మన్ తీవ్రంగా ఆక్షేపించారు. రాజ్యసభ చరిత్రలో ఓ చీకటి దినంగా మిగిలిపోతుందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. భౌతికంగా ఇబ్బంది పెట్టడంతో పాటు డిప్యూటీ ఛైర్మన్‌ను తన విధుల్ని నిర్వర్తించకుండా అడ్డుపడ్డారంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ అనూహ్య పరిణామాల పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన ఘటనను తీవ్రంగా ఖండించారు. నిరసనలకు కారణమైన ఎంపీలు ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు.నిన్న అనుచితంగా ప్రవర్తించిన విపక్ష ఎంపీలపై చర్యలు తీసుకోవాలన్న అధికార భాజపా ఫిర్యాదు మేరకు నిబంధనల ప్రకారం ఛైర్మన్ వారిపై వేటు వేశారు. సభ నుంచి 8 మంది సభ్యులను వారం పాటు సస్పెండ్ చేశారు. ఎంపీలు డెరెక్ ఒబ్రెయన్, సంజయ్ సింగ్, రాజుసత్వ, రిపున్‌బోర, డోలాసేన్, కె.కె.రాగేశ్, నాజిర్ హుస్సేన్, ఎలమరిన్ కరీంపై చర్యలు తీసుకున్నారు. వెంటనే సభ నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. అయినా, వారు నిరాకరించడంతో సభను ఉదయం 10 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా సస్పెండైన ఎంపీలు సభను వీడకపోవడంతో డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సభను మరోసారి వాయిదా వేయాల్సి వచ్చింది.

## కొవిడ్ రికవరీల్లో.. అగ్రస్థానంలో భారత్!



**ఢిల్లీ:** భారత్‌లో కరోనా వైరస్ మహమ్మారి ఉద్ధృతి కొనసాగుతూనే ఉంది. కేసుల సంఖ్య భారీగా పెరుగుతున్నప్పటికీ.. కోలుకుంటున్న వారిసంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. నిత్యం దాదాపు 90వేలకు పైగా పాజిటివ్ కేసులు బయటపడుతున్నాయి. కోలుకుంటున్న వారిసంఖ్య కూడా అదే స్థాయిలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా వైరస్ నుంచి కోలుకుంటున్నవారు భారత్‌లోనే ఎక్కువగా ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా పాజిటివ్ కేసుల సంఖ్య 3కోట్లు దాటగా వారిలో ఇప్పటికే 2కోట్ల 20లక్షల మంది కరోనా బాధితులు కోలుకున్నారు. ఇలా ప్రపంచవ్యాప్తంగా కోలుకున్న వారిలో భారత్‌లో 43లక్షల 96వేల మంది ఉన్నారు. ఇది ప్రపంచ రికవరీల్లో 19శాతం కావడం విశేషం. దీంతో వైరస్ తీవ్రత అత్యధికంగా ఉన్న అమెరికాలో రికవరీల సంఖ్యను భారత్ దాటేసింది. అమెరికాలో ఇప్పటివరకు దాదాపు 42లక్షల మంది కోలుకోగా, బ్రెజిల్‌లో 38లక్షల మంది కోలుకున్నారు. తాజాగా భారత్‌లో ఈ సంఖ్య దాదాపు 44లక్షలకు చేరుకోవడం ఊరట కలిగించే విషయం.

**24గంటల్లో 86వేల కేసులు, 1130 మరణాలు**

గడిచిన 24గంటల్లో దేశవ్యాప్తంగా 7,31,534 కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వీటిలో 86,961 పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. దీంతో సోమవారం నాటికి దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 54,87,580కు చేరినట్లు ప్రభుత్వం వెల్లడించింది. వీరిలో ఇప్పటికే 43లక్షల 96వేల మంది కోలుకోగా, మరో 10లక్షల 3వేల యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా కరోనా మరణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. నిన్న మరో 1130 మంది కరోనా రోగులు మృత్యువాతపడ్డారు. దీంతో ఇప్పటివరకు కరోనా సోకి మృతిచెందిన వారిసంఖ్య 87,882కు చేరింది. ప్రస్తుతం దేశంలో కరోనా రికవరీ రేటు 79.68శాతం ఉండగా, మరణాల రేటు 1.61శాతంగా ఉంది.

## పిడికిలి బిగించిన పెద్దన్న..!

### ఇరాన్‌పై కఠిన ఆంక్షలు..!

### అమెరికాతో విభేదించిన మిత్రదేశాలు




**వాషింగ్టన్:** ఇరాన్‌పై ఉన్న ఐక్యరాజ్య సమితి ఆంక్షలన్నింటినీ పునరుద్ధరించినట్లు అమెరికా ప్రకటించింది. ఈ చర్యని చట్టవిరుద్ధంగా పేర్కొన్న ప్రపంచ దేశాలు ట్రంప్ పాలక వర్గంపై పెదవి విరిచాయి. దీంతో త్వరలో జరగబోయే ఐరాస వార్షిక సమావేశాల్లో ఇది చర్చనీయాంశంగా మారే అవకాశం ఉంది. 2015లో కుదిరిన ఇరాన్ అణుఒప్పందం ప్రకారం 'జాయింట్ కాంప్రిహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్'(జేసీపీఓఏ)లోని నిబంధనల్ని ఇరాన్ ఏమాత్రం పాటించడం లేదని అమెరికా ఆరోపించింది. దీంతో ఐరాస భద్రతా మండలి (యూఎన్‌ఎస్‌సీ) చట్టాల నియమాల ప్రకారం నోటీసు ఇచ్చిన తర్వాత 30 రోజుల గడువు ముగియడంతో ఆంక్షలు తక్షణమే అమలులోకి వచ్చాయని ప్రకటించింది. ఆంక్షలు, వాటిని ఉల్లంఘించిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై సోమవారం శ్వేతసౌధం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. ఐరాస సభ్యదేశాలన్నీ ఈ ఆంక్షల్ని తప్పనిసరిగా పాటించాలని అమెరికా విదేశాంగశాఖ సెక్రటరీ మైక్ పాంపియో అన్నారు. లేదంటే కఠిన చర్యలకు సిద్ధం కావాలని హెచ్చరించారు. ఇరాన్‌పై ఆంక్షల విషయంలో అమెరికా తీరును యూఎన్‌ఎస్‌సీలోని ఇతర సభ్యదేశాలు వ్యతిరేకించాయి. అమెరికా ప్రకటనను విస్మరించాలని నిర్ణయించాయి. అణు ఒప్పందం నుంచి వైదొలిగిన రోజే ఆంక్షలు విధించేందుకు ప్రతిపాదించే హక్కు అమెరికా కోల్పోయిందని గుర్తుచేసింది. మండలిలో సభ్యదేశంగా.. ఒప్పందంలో ప్రాథమిక సభ్యురాలిగా అమెరికాకు ఆ అధికారం ఉంటుందని అగ్రరాజ్యం వాదించింది. అమెరికా ఆంక్షల్ని చైనా, రష్యా మొదటి నుంచీ తప్పుబడుతూ వస్తున్నాయి. అయితే, తాజాగా మిత్రపక్షాలైన ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ సైతం అమెరికా నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ యూఎన్‌ఎస్‌సీ అధ్యక్షుడికి లేఖ రాశాయి. దీంతో అణు ఒప్పందంతో లభించిన ఆంక్షల మినహాయింపును ఇరాన్ అందిపుచ్చుకుంటుందని స్పష్టం చేశాయి.

## ట్రంప్‌పై విషప్రయోగానికి కుట్ర పన్నిన మహిళ అరెస్ట్!



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విష ప్రయోగం జరిపేందుకు కుట్రపన్నినట్లు అనుమానిస్తున్న ఓ మహిళను పోలీసులు అరెస్టు చేశారు. న్యూయార్క్-కెనడా సరిహద్దుల్లో ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ట్రంప్‌నకు చేరేలా శ్వేతసౌధం చిరునామాతో వచ్చిన పార్శిల్ కెనడా నుంచి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. దాని ఆధారంగా జరిపిన విచారణలో ఓ మహిళే నిందితురాలని తేలినట్లు తెలుస్తోంది. ఆమె వివరాలు మాత్రం బయటకు వెల్లడించలేదు. 'రైసిన్' అనే విషం ఉన్న ఓ పార్శిల్‌ను అధ్యక్ష భవనానికి చేరకముందే పోలీసులు పరీక్షించి అడ్డుకున్న విషయం తెలిసిందే. ఆ పార్శిల్‌ను ఎవరు పంపించారో గుర్తించేందుకుగానూ ఎఫ్‌బీఐ, సీక్రెట్ సర్వీస్, అమెరికా పోస్టల్ తనిఖీ సేవల విభాగం దర్యాప్తు చేశాయి.

## ప్రీ-క్లినికల్ ట్రయల్స్‌లో 4 దేశీయ వ్యాక్సిన్లు

### పార్లమెంటులో వెల్లడించిన ఆరోగ్య మంత్రి

**ఢిల్లీ:** కొవిడ్-19 వ్యాక్సిన్ తయారీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ, సహకారాలు అందజేస్తోందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. కాగా, దేశంలో నాలుగు వ్యాక్సిన్ తయారీ ప్రయత్నాలు ప్రి-క్లినికల్ ట్రయల్స్ దశలో ఉన్నాయని ఆయన పార్లమెంటుకు వివరించారు. "ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ నిరోధక వ్యాక్సిన్ తయారీలో 145 సంస్థలు ముందంజలో ఉన్నాయి. వాటిలో 35 క్లినికల్ ట్రయల్స్ దశలో ఉన్నాయి. ఇక భారత్ విషయానికి వస్తే.. దేశంలోని వ్యాక్సిన్ తయారీలో ఉన్న 30 ఫార్మా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందజేస్తున్నాం. వాటిలో మూడు అడ్వాన్స్‌డ్ ట్రయల్స్ 1,2,3 దశల్లో ఉన్నాయి. కాగా, మరో నాలుగు ప్రీ-క్లినికల్ ట్రయల్స్ దశలో ఉన్నాయి." అని మంత్రి లోక్‌సభలో వెల్లడించారు. అంతేకాకుండా కరోనా నేపథ్యంలో 50,000 దేశీయ వెంటిలేటర్ల



ఏర్పాటు నిమిత్తం పీఎం కేర్స్ నిధి నుంచి ఆరోగ్యశాఖకు రూ.893.93 కోట్ల విరాళం లభించినట్టు కూడా ఆయన వివరించారు. వ్యాక్సిన్ తయారీలో హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, అహ్మదాబాద్ ఫార్మా సంస్థ జైడస్ క్యాడిలాల ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఆయన వివరించారు. భారత్ బయోటెక్ కొవిడ్-19 వ్యాక్సిన్ తయారీలో ముందంజలో ఉన్న సంగతి తెలిసిందే.

## 'ఇలాంటప్పుడు బయో వ్యర్థాల నిర్వహణ సవాలే'

### అది రాష్ట్రాల పరిధిలోని అంశమన్న కేంద్రం



**ఢిల్లీ:** కరోనా మహమ్మరి విజృంభిస్తున్న ఈ తరుణంలో బయో వ్యర్థాల నిర్వహణ సవాల్‌తో కూడుకున్నదేనని కేంద్రమంత్రి అశ్విని కుమార్ చౌబే వ్యాఖ్యానించారు. రాజ్యసభలో భాజపా ఎంపీ మహేశ్ పొద్దార్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. కొవిడ్ బాధితులకు చికిత్స అందించేందుకు వైద్యులు, సిబ్బంది పీపీఈ కిట్లు, ఇతర సురక్షితమైన పరికరాలను ధరిస్తుంటారు. వ్యాధిగ్రస్తులకు వాడిన తర్వాత అధిక మొత్తంలో బయో వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) సమాచారం ప్రకారం బయో వ్యర్థాల నిర్వహణ పెను సవాల్‌గా మారిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. అయితే బయో వ్యర్థాల నిర్వహణ అంతా రాష్ట్రాల పరిధిలోనే ఉంటుందని స్పష్టంచేశారు. అందువల్ల బయో వ్యర్థాలకు సంబంధించిన డేటా కేంద్రం వద్ద ఉండదని చెప్పారు. ప్రజారోగ్యం అనేది రాష్ట్రాలకు సంబంధించిన అంశమన్నారు. చెత్త సేకరించే వారిలోనూ కరోనా బారిన పడుతున్నారని పేర్కొన్నారు. బయో వ్యర్థాల నిర్వహణ కోసం ఇప్పటికే కేంద్ర పీసీబీ ప్రత్యేకంగా మార్గదర్శకాలను విడుదల చేసినట్లు కేంద్రమంత్రి అశ్విని కుమార్ చౌబే తెలిపారు. కొవిడ్‌కు సంబంధించి బయో వ్యర్థాల నిర్వహణలో తప్పనిసరిగా మాస్కులు, గ్లౌజులు వినియోగించేలా మార్చి 19వ తేదీనే మార్గదర్శకాల్లో పేర్కొన్నామని చెప్పారు. మళ్లీ జులై 17న మరికొన్ని సవరణలు చేసి మార్గదర్శకాలను రూపొందించినట్లు వివరించారు. బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం పీపీఈ కిట్లు, ఫేస్ షీల్డ్స్, కళ్లజోళ్లు, సూట్లు, ప్లాస్టిక్ కవర్లు, మాస్కులతోపాటు కొవిడ్ ఐసోలేషన్ వార్డుల నుంచి సేకరించిన బయో వ్యర్థాలను వేరు చేసి పంపాలని సూచించినట్లు చెప్పారు. ఇళ్లల్లో, వాణిజ్య సముదాయాల్లో, సంస్థల్లో వినియోగించిన మాస్కులు, గ్లోవ్స్‌ను ముక్కలు చేసి 72 గంటల పాటు ప్రత్యేకంగా వేరు చేసి ఆ తర్వాత ఘన పదార్థాలతో పడవేయాలని సూచించామని కేంద్రమంత్రి వెల్లడించారు.

## కనీస మద్దతు ధర : చిదంబరం ఫైర్



**న్యూఢిల్లీ:** కేంద్రం కొత్తగా ఆమోదించిన నూతన వ్యవసాయ బిల్లులపై విపక్ష పార్టీల నిరసన కొనసాగుతున్న తరుణంలో కేంద్ర మాజీ ఆర్థికమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిదంబరం కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధానంగా కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)పై ఆయన తన దాడిని ఎక్కుపెట్టారు. ప్రభుత్వం వద్ద ప్రైవేటు వాణిజ్యానికి సంబంధించిన డేటా అందుబాటులో లేనప్పుడు రైతులకు కనీస మద్దతు ధర ఎలా ఇస్తారని ప్రశ్నించారు. భారతదేశం అంతటా ప్రతిరోజూ వేలాది గ్రామాల్లో మిలియన్ల ప్రైవేటు లావాదేవీలు జరుగుతాయి. ఏ రైతు ఏ వ్యాపారికి ఏ ఉత్పత్తులను అమ్మారో ప్రభుత్వానికి ఎలా తెలుస్తుందని వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌ను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎలా ప్రణాళికలు వేస్తోందని చిదంబరం ట్వీట్ చేశారు. రైతుకు చెల్లించే ధర మద్దతు ధరకంటే చాలా తక్కువగా ఉంటోందని చిదంబరం ఆరోపించారు. రైతుల పంటకు మద్దతు ధర కల్పిస్తామంటూ చెబుతున్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇప్పటివరకు ఆ పని ఎందుకు చేయలేదని నిలదీశారు. దీన్ని గుడ్డిగా నమ్మేందుకు రైతులు మూరు?లు అని మంత్రి ప్రభుత్వం భావిస్తోందా అని మండిపడ్డారు. దీంతో పాటు సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు మోదీ సర్కార్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన వైనంపై ఆయన విరుచుకుపడ్డారు. ప్రధానంగా ప్రతి భారతీయుడి ఖాతాలో15 లక్షలు రూపాయలు వేస్తామన్న హామీని మోదీ ప్రభుత్వం నెరవేర్చిందా? రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేశారాట? ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాల వాగ్దానం సంగతి ఏమిటని చిదంబరం ప్రశ్నించారు.కాగా, వ్యవసాయానికి సంబంధించిన ఫార్మర్స్ ప్రొడ్యూస్ ట్రేడ్ అండ్ కామర్స్ బిల్లు, ఫార్మర్స్ అగ్రిమెంట్ ఆన్ ప్రైస్ అస్యూరెన్స్ అండ్ ఫార్మార్స్ సర్వీసు బిల్లులకు ఇప్పటికే లోక్‌సభ ఆమోదం తెలుపగా, ఆదివారం రాజ్యసభ కూడా ఆమోదించింది. రాష్ట్రపతి సంతకంతో ఈ బిల్లులు అమలులోకి రానున్నాయి. కొత్త వ్యవసాయ బిల్లులంటూ రాజకీయ రగడ నడుస్తోంది. కార్పొరేట్లకు కొమ్ముకాసేందుకే ప్రభుత్వం ఈ బిల్లులను తీసుకొచ్చిందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. దీనిపై దేశవ్యాప్తంగా రైతులు నిరసనలు చేస్తున్న సంగతి తెలిసిందే.

## ప్రధాని రాజీనామాకు ప్రతిపక్షాల డిమాండ్

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌పై విపక్షాలు గుర్రుగా ఉన్నాయి. తక్షణమే ఆయన రాజీనామా చేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాయి. ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని కూల్చే లక్ష్యంతో 'పాకిస్తాన్ డెమొక్రటిక్ మూవ్‌మెంట్' అనే కొత్త కూటమిని ఏర్పాటు చేయనున్నట్లు పాకిస్తాన్ ప్రతిపక్ష పార్టీలు ఆదివారం ప్రకటించాయి. ఈ మేరకు పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) నిర్వహించిన ఆల్ పార్టీస్ కాన్ఫరెన్స్ (ఏపీసీ) 26 పాయింట్ల ఉమ్మడి తీర్మానాన్ని ఆమోదించింది. పాకిస్తాన్ ముస్లిమ్స్ లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్), జామియాత్ ఉలేమా-ఈ-ఇస్లాం ఫాజల్ (జేయూఐ-ఎఫ్)తో పాటు అనేక ఇతర పార్టీలు దీనిలో పాలుపంచుకున్నాయి. అనంతరం విలేకరుల సమావేశంలో జామియాత్ ఉలేమా-ఈ-ఇస్లాం(జేయూఐ-ఎఫ్) చీఫ్ మౌలానా ఫజ్ల్-ఉర్-రెహమాన్ మాట్లాడుతూ.. 'ఎన్నికైన ప్రధానమంత్రి ఇమ్రాన్ అహ్మద్ నియాజీని వెంటనే రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అక్టోబర్ నుంచి దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతాయి. వీటిలో న్యాయవాదులు, వ్యాపారులు, కార్మికులు, రైతులు పౌర సమాజం పాల్గొనడం జరుగుతుంది' అన్నారు.

## భారత సైన్యం అధీనంలో ఆరు కీలక కొండలు!



**ఢిల్లీ:** ఇండో-చైనా సరిహద్దుల్లో భారత సైన్యం ఎంతో అప్రమత్తంగా వ్యవహరిస్తూ డ్రాగన్ ఎత్తులను చిత్తు చేస్తోంది. గత మూడు వారాల్లో భారత సైన్యం లద్ధాఖ్‌లో వాస్తవాధీన రేఖ వెంబడి ఉన్న ఆరు ప్రధాన ఎత్తయిన కొండలను స్వాధీనం చేసుకుందని ప్రభుత్వ వర్గాలు ఓ మీడియాతో తెలిపాయి. ఆయా వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం.. 'ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ రెండో వారం వరకు వాస్తవాధీన రేఖ వెంబడి భారత సైన్యం ఆరు ముఖ్యమైన కొండలను స్వాధీనం చేసుకుంది. వాటిలో మగర్ హిల్, గురుంగ్ హిల్, రెసెహెన్ లా, రెజంగ్ లా, మొఖ్పారీ, ఫింగర్ 4 సమీపంలో మరో ఎత్తయిన ప్రాంతం' ఉన్నాయని తెలిపాయి.'చైనా ముందుగా ఆయా కొండలను ఆక్రమించి భారత్‌ను దెబ్బ తీయాలని భావించినప్పటికీ.. భారత సైన్యం ఎంతో అప్రమత్తంగా వ్యవహరించి వాటిని స్వాధీనం చేసుకున్నాయి. దీని ద్వారా ఇప్పుడు మన దళాలకు శత్రువుల కదలికలపై నిఘా పెట్టడం మరింత సులువు అవుతుంది. అలా చైనా ప్రయత్నాలు విఫలం కావడంతో పాంగాంగ్ ఉత్తర ప్రాంతంలో డ్రాగన్ సైన్యం మూడు సార్లు గాల్లోకి కాల్పులకు తెగబడింది. భారత సైన్యం ఆయా ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడంతో రెజంగ్ లా, రెచెన్ లా కొండల సమీపంలో చైనా ఆర్మీ 3వేల అదనపు సాయుధ బలగాలను మోహరించింది. డ్రాగన్ సైన్యం పలు విధాలుగా రెచ్చగొట్టేందుకు యత్నిస్తుండటంతో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, సీడీఎస్ బిపిన్ రావత్, ఆర్మీ చీఫ్ మనోజ్ నరవణేల పర్యవేక్షణలో భారత భద్రతా దళాలు సంయుక్తంగా పనిచేస్తున్నాయి' అని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.భారత్, చైనా సరిహద్దుల్లో వాస్తవాధీన రేఖను మార్పు చేసేందుకు చైనా యత్నించడంతో గత కొన్ని నెలలుగా రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో జూన్‌లో గల్వాన్ వ్యాలీ సమీపంలో చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ హద్దులు మీరి 20 మంది భారత సైనికులను పొట్టన పెట్టుకుంది. దీంతో భారత్ కూడా సైన్యం ఆయుధాలు ఉపయోగించవద్దనే నిబంధనలో మార్పులు చేసింది.

## రైతుల్లో గందరగోళానికి యత్నించారు: రాజ్‌నాథ్



**ఢిల్లీ:** పార్లమెంటులో వ్యవసాయ బిల్లుల ఆమోదం సమయంలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరుపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విచారం వ్యక్తం చేశారు. వ్యవసాయ బిల్లులపై రైతుల్లో గందరగోళం సృష్టించి వారిని తప్పుదోవ పట్టించేందుకు యత్నించారని ఆరోపించారు. ఈమేరకు ఆయన పలువురు కేంద్ర మంత్రులతో కలిసి ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. 'ప్రభుత్వం రైతులను బాధపెడుతుందంటే ఎప్పటికీ నమ్మకూడదు. నేను కూడా రైతునే. దేశంలోని రైతులందరికీ నేను హామీ ఇస్తున్నాను. కనీస మద్దతు ధర, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీలకు ముగింపు పలికే ఉద్దేశం లేదు. హర్‌సిమ్రత్ కౌర్ కేంద్ర మంత్రి పదవికి ఎందుకు రాజీనామా చేశారనే విషయంపై నేను వ్యాఖ్యానించను. ఎందుకంటే ప్రతి నిర్ణయం వెనుక కొన్ని రాజకీయ కారణాలుంటాయి. ఏదైనా అంశంపై సభలో చర్చలకు అవకాశం ఇవ్వడం అధికారపార్టీ బాధ్యత. దాన్ని ప్రతిపక్షాలు గౌరవించాలి. కానీ రాజ్యసభలో ఈరోజు కొందరు సభ్యులు డిప్యూటీ ఛైర్మన్ పట్ల వ్యవహరించిన తీరు చాలా తీవ్రమైనది. అది పార్లమెంటు గౌరవానికి భంగం కలిగించేలా ఉంది. ఇప్పటివరకు లోక్‌సభ, రాజ్యసభ చరిత్రలోనే ఇలాంటి ఘటనలు జరగలేదు'అని రాజ్‌నాథ్ అన్నారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌పై ప్రతిపక్షాలు చేసిన అవిశ్వాస తీర్మానం గురించి మాట్లాడుతూ.. 'ఛైర్మన్‌కు నోటీసులు అందాయి. నిర్ణయం ఆయనే తీసుకుంటారు. అది ఆయన హక్కు. రాజకీయంగా నేను ఏం వెల్లడించను' అని చెప్పారు. విపక్షాల తీవ్ర అభ్యంతరాల నడుమ ఆదివారం రాజ్యసభలో రెండు వ్యవసాయ సంబంధిత బిల్లులు మూజువాణి ఓటుతో ఆమోదం పొందినట్లు డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా ఆ బిల్లుల్ని కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా ఆమోదింపజేసుకోవడంలో డిప్యూటీ ఛైర్మన్ సహకరించారని ఆరోపిస్తూ 12 ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చాయి.

# విజయనగరం- శ్రీకాకుళం- కాకినాడ



## నేషనల్ ఓవర్సీస్ స్కాలర్షిప్ దరఖాస్తుల స్వీకరణ

**పార్వతీపురం, వార్తావళి, సెప్టెంబర్ 21 :** గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ వారు నేషనల్ ఓవర్సీస్ స్కాలర్షిప్ నిమిత్తం అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరిస్తున్నరు అని ట్రైబల్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఇంజనీరింగ్, మేనేజ్మెంట్, ఎకనామిక్స్, ఫైనాన్స్ కి సంబంధించి 7 స్లెట్స్. ప్యూర్ సైన్స్, అప్లైడ్ సైన్స్ 3 స్లాట్స్. అగ్రికల్చర్. మెడికల్ 6 స్లాట్స్. హుమెనిటిస్, సోషల్ సైన్స్ 5 స్లాట్స్ ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సంబంధించి 6 లక్షల వార్షిక ఆదాయం మించరాదు. అలాగే జూలై 1, 2020 నాటికి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలి, దరఖాస్తు నమోదు చేసుకొనుటకు సెప్టెంబర్ 30, 2020 చివరి తేదీ అని తెలిపారు. అర్హతలు :పోస్ట్ డాక్టర్ రిసేర్చ్ :- 55 శాతం మార్కులు లేదా తత్సమాన గ్రేడ్ లో మాస్టర్ డిగ్రీ మరియూ పి. హెచ్.డి 5 సంవత్సరాల అనుభవం ఉండాలి. పి. హెచ్.డి :- 55 మార్కులు లేదా తత్సమాన గ్రేడ్ లో మాస్టర్ డిగ్రీ , 2 సంవత్సరాల టీచింగ్ రీసెర్చ్ /ప్రోఫేషనల్ / ఎం. ఫీల్ డిగ్రీ సంబంధిత ఫీల్డ్ లో అనుభవం ఉండాలి. అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును. మాస్టర్ డిగ్రీ :- 55 మార్కులు లేదా తత్సమాన గ్రేడ్ లో బ్యాచిలర్ డిగ్రీ, 2 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి. ఫైనాన్షియల్ అసిస్టెంట్ :- పోస్ట్ డాక్టరల్ రీసెర్చి కు ఒకటిన్నర సంవత్సరములు, పి. హెచ్.డి అభ్యర్థులకు నాలుగు సంవత్సరాలు, మాస్టర్ డిగ్రీ అభ్యర్థులకు 1/2/3 కోర్స్ కాలవ్యవధి ని ఆనుసారించి. భారత దేశం నుండి దగ్గర దేశంలో వున్న విద్యా సంస్థలకు రాను పోను ఎయర్ పాసేజ్ సౌకర్యం కల్పిస్తారు, విసా ఛార్జీలు ఇండియన్ కరెన్సీలో. చెల్లించబడతాయి. ఇన్సిడెంట్ జర్నీ ఖర్చులు 18.70 అమెరికా డాలర్లు లేదా సమన మైన ఇండియన్ కరెన్సీ చెల్లించబడును. ఒక్కసారి ఎంచుకున్న కోర్సును మార్చు కొనడానికి ఆవకశాం లేదు, మిగిలిన వివరాలకు http://over-seas.tribal.gov.in సందర్శించవలసినదిగా డిప్యూటీ డైరెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు.

## ఎంఆర్ కళాశాల మన వారసత్వ సంపద

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 21 :** ఎంతో ఘన చరిత్ర గల విజయనగరం మహారాజా కళాశాల మన వారసత్వ సంపద అని, దానిని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్ అన్నారు. ముందుగా కళాశాలలో ఏర్పాటు చేసిన సచివాలయ పరీక్షా కేంద్రాన్నిసోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఆర్ కళాశాలకు సుదీర్ఘ చరిత్ర ఉందని, దానిని సంరక్షించి, ప్రాంగణాలను అందంగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. కళాశాలలో అందమైన మొక్కలను నాటడంతోపాటు, ప్రాంగణం బయట ఉన్న చెట్లకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దాలని కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎ.కళ్యాణికి సూచించారు. గురజాడ విగ్రహం ఉన్న జంక్షన్‌ను కూడా అందంగా తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించారు. కళాశాలలో మొక్కలను నాటడమే కాకుండా, హరిత విజయనగరం సాధించడానికి, పచ్చదనాన్ని పెంపొందించడానికి హోర్డింగులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

## కట్టుబాట్లను కించపరిచేలా మాట్లాడటం బాధాకరం



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 21 :** జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఐ.వి.పి. రాజు మాట్లాడుతూ టీటీడీ ఛైర్మన్ వై. వి. సుబ్బారెడ్డి హిందూ మత గౌరవాన్ని, కట్టుబాట్లను కించపరిచేలా మాట్లాడటం చాలా బాధాకరం అన్నారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం తిరుమలకు వెళ్లిన అన్యమతస్థులు ఎవరైనా వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో డిక్లరేషన్ పై సంతకం చేసి దర్శించుకునే పద్ధతి ఎప్పటినుండో కొనసాగుతుంది. గతంలో కూడా సోనియా గాంధీ గారు, అబ్దుల్ కలాం గారు దర్శనం చేసుకునేటప్పుడు డిక్లరేషన్ పై సంతకం చేసి వెళ్లడం జరిగిందని గుర్తుకు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డి గారు మాట్లాడుతూ ఎలాంటి నిబంధనలు అవసరం లేదు మీరు తిరుమల కొండ పైకి వెళ్లి ఎలా అయినా మాట్లాడుకోవచ్చు, ఏమైనా చేసుకోవచ్చు అనే ధోరణి చూస్తుంటే హిందూ మతస్థులు, హిందూ మతాన్ని అభిమానించే వారు ఆవేదన చెందుతున్నారు, ఇలాంటి విషయాలను అందరు ఖండించే పరిస్థితి కనిపిస్తుంది. ప్రపంచంలోనేలో ప్రఖ్యాతి గాంచిన కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా ఉంటూ హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన సుబ్బారెడ్డి గారిని ఆ పదవి నుండి సస్పెండ్ చేయాలని జిల్లా తెలుగుదేశం పార్టీ తరపున డిమాండ్ చేశారు.

## చందన బ్రదర్స్ అక్రమ లాకౌట్ ఎత్తి వేయాలి

### గౌవాధ్యక్షుడురెడ్డి శంకరరావు



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 21 :** విజయనగరం చందన బ్రదర్స్ అక్రమ లాకౌట్ ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్ష ను సీఐటీయూ నగరగౌరవ అధ్యక్షులు రెడ్డి శంకరరావు ప్రాంబించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కాలంలో కార్మికులను తొలగించడంబీ రోడ్ మీద పడి వేసి న చందన బ్రదర్స్ షాప్ యాజమాన్యం వైఖరిని తీవ్రంగా కండించారు. తక్షణమే లాకౌట్ ఎత్తి వేసి కార్మికలందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమ తో కోట్లు సంపాదంచిన యాజమాన్యం నేడు లాభాలు రావడం లేదు అని లాకౌట్ చేయడం మానవత్వం అనిపించు కొదని ఆయన అన్నారు. చందన బ్రదర్స్ కార్మికుల సమస్యను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేక పోతే పోరాటం వుధృతం చేస్తామని అందుకు పూర్తి బాధ్యత యాజమాన్యం వహించాలని అన్నారు. ఈ కార్య క్రమములో చందన కార్మికులు పాల్గొన్నారు.

## పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్ యాప్ ఆవిష్కరణ



**సాలూరు, వార్తావళి, సెప్టెంబర్ 21 :** ప్రజలకు 87 పోలీసు సేవలను పోలీసు స్టేషనుకు రాకుండా పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అందించేందుకు ఎపి పోలీసు సేవ సిటిజన్ సర్వీసు అప్లికేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సెప్టెంబర్ 21న ఆవిష్కరించగా, ఆవిష్కరణ కార్యక్రమంలో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి, ఐపీఎస్ మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ యాప్ వలన మహిళలు తమ ఇంటి నుండే మొబైల్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నందున, స్వేచ్ఛగా, ఏటువంటి సంకోచం లేకుండా తమ బాధలను నిర్భయంగా తెలుపుకొనే అవకాశం లభిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి గార్కి జిల్లా ఎస్పీ రాజకుమారి తెలిపి, ప్రజల్లో ఈ యాప్ గురించి విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు.

## వ్యవసాయ బిల్లులతో రైతుకు అన్యాయం

### ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కె. దయానంద్

**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 21 :** కేంద్రం తీసుకొస్తున్న 3వ్యవసాయ బిల్లులతో దేశంలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, అందుకనే ఆమ్ ఆద్మీ పార్టీ ఈ బిల్లులను వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కె.దయానంద్ తెలిపారు. ఆదివారం నాడు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు నష్టం కలిగించే ఈ 3బిల్లులకు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలు వ్యతిరేకంగా ఓటు వేయనున్నారని అన్నారు. 3 వ్యవసాయ బిల్లులను పరిశీలిస్తే వ్యాపారులకు, కార్పొరేటర్లకు లాభం కలిగించేలా తయారుచేశారని ఆయన ఆరోపించారు. కేంద్రానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే అన్ని పంటలకు లాభసాటి ధర ఇస్తే చాలని, స్వామినాధన్ కమిషన్ సిఫారసు చేసినట్లు రైతు ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి ధర చెల్లించాలని, సమయానికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై ఇవ్వాలని, రైతుల్ని సొంత కాళ్ల పై నిలబెట్టేలా ఇలాంటి చర్యలు చేపట్టకుండా వ్యాపారులకు, కార్పొరేటర్ లకు మేలు కలిగించే బిల్లులు తీసుకురావడం దారుణమని అన్నారు. పార్లమెంట్ లో అన్ని విపక్షాలు ఈ బిల్లులను వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బూరాడ శ్రీనివాస్, నియోజకవర్గం కన్వీనర్ తిప్పాన కోటేశ్వరరావు, సరోజినీ, సైలాడ రమణ, కిలాని శ్రీను పాల్గొన్నారు.

## శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురజాడ జయంతి



**ఎస్‌కోట, వార్తావళి, సెప్టెంబర్ 21 :** అయ్యన్నపేట జంక్షన్ కూడలిలో ఉన్న శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్(డిస్ట్రిక్ట్-102) నడక మైదానంలో క్లబ్ అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు(బాలు) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం మహాకవి గురజాడ అప్పారావు గారి జయంతిని నిర్వహించారు. ముందుగా క్లబ్ సభ్యులు గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ పెద్దలు, ఎలెక్ట్ గవర్నర్ శ్రీ యడ్ల గణేష్ గారు మాట్లాడుతూ జనుల భాషకు పీటవేసి,భావితరాలకు బాటవేసిన కవితావిశారధుడు, గురజాడ అని అన్నారు. ఈకార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ములగ శ్రీనివాసరావు గారు,కోశాధికారి ఆర్.సి.హెచ్. అప్పలనాయుడు గారు,క్లబ్ గౌరవ సలహాదారులు ఆరికతోట తిరుపతి రావు గారు, క్లబ్ పెద్దలు వల్లూరి శ్రీనివాసరావుగారు, తాడ్డి ఆదినారాయణ గారు, నడుపూరి వెంకటరమణ గారు, గోవిందరావుగారు, లక్ష్మణరావు గారు,కె.ఈశ్వరరావు గారు, యడ్ల శ్రీనివాసరావు గారు,కె.సత్యన్నారాయణ గారు,పైడియ్య గారు,నారాయణ రావు గారు, జాలీవాకర్ నలమరాజు తదితరులు పాల్గొన్నారు.



**బీఎన్ఆర్ ఆశ్రమంలో..** విశ్వమానవాలికి ఒకటే దేశభక్తిగీతం జాతీయగీతంగా రాసిన మహోన్నతమైన వ్యక్తి మన గురజాడ మాత్రమేననీ అటువంటి మహనీయుడు మన విజయనగరంలో నడయాడడం మన అదృష్టమని భీశెట్టి ఫౌండేషన్ అధినేత భీశెట్టి బాబ్జి అన్నారు ఆదివారం బిఎన్ఆర్ ఆశ్రమంలో "గురజాడకు కవితా నీరాజనం "అనే సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు నమ్మి శ్రీను,కరగాని ప్రసాద్,పోటుపురెడ్డి శ్రీను, బహుమతులు పొందిన విద్యార్థునిలు పిల్లేడ భార్గవి,పూసర్ల లక్ష్మీ,పి.ఝాన్సి,భవాని, తదితరులు పాల్గొన్నారు.



**జనసేన పార్టీ ఆధ్వర్యంలో..** పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు(బాలు) గురజాడ అప్పారావు జంక్షన్ వద్దనున్న నవయుగ వైతాళికుడు, మహాకవి గురజాడ అప్పారావు 158వ జయంతి సందర్భంగా గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా బాలు మాట్లాడుతూ గురజాడ 150 వ జయంతోత్సవాల సందర్భంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గురజాడ గృహాన్ని మ్యూజియంగా చేస్తామని, గురజాడ ఓపెన్ ఆడిటోరియాన్ని అభివృద్ధి చేస్తామని అందుకోసం సుమారు 100 కోట్లు కేటాయించడం జరిగిందని బాలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఏంటి రాజేష్,లోపింటి కళ్యాణ్, కులదీప్, ప్రసాద్,నారంసెట్టి వెంకటరమణ,ఝాన్సీ వీరమహిళ గంట్లాన పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

**అభ్యుదయ కవితకు పితామహుడు గురజాడ**

**రాష్ట్ర సంస్కృతి మండలి ఛైర్‌పర్సన్ వంగపండు ఉష**



మహాకవి గురజాడ అప్పారావు అభ్యుదయ కవిత్వానికి పితామహులని, రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి మండలి ఛైర్‌పర్సన్ వంగపండు ఉష కొనియాడారు. సామాజిక దురాచారాలను తన రచనల ద్వారా పారద్రోలిన గొప్ప కవిగా గురజాడకు చరిత్రలో చిరస్మరణీయ స్థానం ఉందని అన్నారు. గురజాడ స్ఫూర్తిని నిలబెట్టుకొనేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు పెనుమత్స సూర్యనారాయణరాజు, శాసన సభ్యులు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, జాయింట్ కలెక్టర్(ఆసరా) జె.వెంకటరావు, అసిస్టెంట్ కలెక్టర్ కె.సింహాచలం, డిఆర్ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డిఓ బిహెచ్ భవానీశంకర్, జిల్లా పర్యాటకాధికారి పిఎన్‌వి లక్ష్మీనారాయణ, డిఎస్‌డిఓ ఎస్.వెంకటేశ్వర్రావు, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి డి.రమేష్, డిఇఓ జి.నాగమణి, ఐసిడిఎస్ పిడి ఎం.రాజేశ్వరి, ఎంఆర్ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ పరశురామ్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, సింహాచల దేవస్థానం పాలకమండలి సభ్యులు రొంగలి పోతన్న, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్ట బాబ్జీ, బిజెపి నాయకులు బి.శివప్రసాదరెడ్డి, వైకాపా నాయకులు ఐ.రఘురాజు, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎంవిఆర్ కృష్ణాజీ, గురజాడ విద్యాసంస్థల అధినేత ప్రమీల, గురజాడ వారసులు వెంకటేశ్వరప్రసాద్, ఇందిర, ఇంకా డాక్టర్ వెంకటేశ్వర్రావు తదితర ప్రముఖులు, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## షూటింగ్ బాల్ క్రీడకు కేంద్ర ప్రభుత్వపు ఉద్యోగాలలో గుర్తింపు



**విజయవాడ, వార్తావళి, సెప్టెంబర్ 21 :** 2013 అక్టోబర్ 3వ తేదీ సర్క్యులర్ ప్రకారం సెంట్రల్ గవర్నమెంట్ జాబ్స్ లో స్పోర్ట్స్ కోటాకు 43 క్రీడాంశాలు మాత్రమే ఉన్నాయి. వాటిని ఇప్పుడు 2020 సెప్టెంబర్ 1 వ తేదీన 63 క్రీడాంశాలకు పెంచడం జరిగింది. గ్రూప్ ' సి ' లో కూడా ఉద్యోగ అవకాశాలలో 63 క్రీడాంశాలు చేర్చినట్టు కేంద్ర ప్రభుత్వ క్రీడా మంత్రిత్వశాఖ వారు బుధవారం జీవోను విడుదల చేయడం శుభపరిణామం అని , అందులో ' షూటింగ్ బాల్ క్రీడ ' కు స్థానం దక్కడం ఎంతో సంతోషం కలిగించింది అని ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు స్వీయ ప్రకటన విడుదల చేశారు. ఇకనుంచి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఉద్యోగ నోటిఫికేషన్ లో నైనా క్రీడా కోట గ్రూప్' సి' కింద ' షూటింగ్ బాల్ ' క్రీడాకారులు అర్హులేనని తెలిపారు. క్రీడలపై కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాట్టు తెలిపారు.



కేంద్ర జల శక్తి మంత్రి గజేంద్ర సింగ్‌ను రాష్ట్ర మంత్రి అనిల్ యాదవ్, ఎంపీలు మిథున్ రెడ్డి, కలిశారు. గోరంట్ల మాధవ్, లావు కృష్ణదేవరాయలు పోలవరం బకాయిలు, పునరావాసం ప్యాకేజీ నిధులు విడుదల చేయాలని వినతి సమర్పించారు.
**- వార్తావళి, విజయవాడ**

## పాలకొండ ప్రభుత్వ హాస్పిటల్‌కు చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు ఆళ్ల నాని, ధర్మాన కృష్ణదాస్



**సీతంపేట, వార్తావళి, సెప్టెంబర్ 21 :** అరకు పార్లమెంట్ పరిధిలోని పాలకొండలో సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ నిర్మాణానికి స్థలం పరిశీలన చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన కృష్ణ దాస్...గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్ప శ్రీ వాణి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ అప్పలరాజు, కళావతి, కలెక్టర్ నివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మావోయిస్టులు ప్రాబల్యం ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు ఆరోగ్యం లక్ష్యంగా భద్రతను సైతం లెక్కచేయకుండా మారుమూల గిరిజన ప్రాంతంలో పర్యటించిన మంత్రులు ఆళ్ల నాని, ధర్మాన కృష్ణ దాస్... పుష్ప శ్రీ వాణి, డాక్టర్ అప్పలరాజు.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైస్ జగన్మోహనరెడ్డి సంకల్పం... మెడికల్ కాలేజీల నిర్మాణానికి 2050కోట్లు రూపాయలు నిధులు మంజూరు చేశారు.

## జిల్లా కేంద్రంలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు



**కొత్తవలస, వార్తావళి, సెప్టెంబర్ 21 :** సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉత్సవంగా గురజాడ జయంతి వేడుకల నిర్వహణ గురజాడ అప్పారావు స్వగృహంలో జరిగిన వేడుకల్లో పాల్గొని ఘన నివాళులు అర్పించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, సాంస్కృతిక సంఘాలు, సాహితీ వేత్తలు గురజాడకు ఘన నివాళులు అర్పించిన రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్ పర్సన్ వంగపండు ఉష, శాసన మండలి సభ్యులు పెనుమత్స సురేష్ బాబు, శాసన సభ్యులు బొత్స అప్పల నరసయ్య, శంబంగి చిన అప్పల నాయుడు, మాజీ ఎం.పి. బొత్స ఝాన్సీ, జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజ వహర్ లాల్, గురజాడ కుటుంబ సభ్యులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు గురజాడ రచించిన దేశమంటే మట్టి కాదోయ్ అనే గేయాన్ని ఆలపించిన సంగీత కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు.



పార్వతీపురంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి ఎదురుగా వున్న పశు సంవర్ధక శాఖ కార్యాలయం ఆవరణలో స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రులు.
**- వార్తావళి, పార్వతీపురం**

## 'స్పందన'కు 115 వినతులు

### జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 21 :** స్పందన కార్యక్రమానికి 115 వినతులు వచ్చి నట్లు జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి పేర్కొన్నారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలోని స్పందన విభాగంలో స్పందన కార్యక్రమం జరిగింది. హిరమండలం మండలం చిన్నకొల్లివలస గ్రామం నుండి పాయల అప్పల స్వామి ఫోన్ కాల్ లో మాట్లాడుతూ తనకు ఏక్స్ డెంటు అయినది ఎక్కువ మొత్తంలో డబ్బులు ఖర్చు అవుతున్నదని, తాను నిరుపేదనైనందున తనకు సాయం అందించాలని కోరారు. టెక్కలి మండలం రాయవలస గ్రామం నుండి డి.రవణమ్మ ఫోన్ చేస్తూ తనకు సొంత భూమి లేదని, తనకు రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు. రణస్థలం మండలం దీరసాం గ్రామం నుండి డి.సత్యవతి 1- బి అడంగల్ పట్టా ఇవ్వడం లేనందున ప్రభుత్వ పథకాలు అందడం లేదని, తనకు అడంగల్, 1-బి పట్టా మంజూరు చేయవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ శాఖకు చెందినవి 26 కాగా, పౌర సరఫరాల శాఖకు సంబంధించినవి 19, ఇతర శాఖలకు సంబంధించి 70 వినతులు వచ్చినట్లు తెలిపారు. కరోనా నేపథ్యంలో ప్రజలు జిల్లా ప్రధాన కేంద్రానికి రాకుండా ఫోన్ లేదా ఇ-మెయిల్ ద్వారా వినతులు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ పిలుపునిచ్చిన సంగతి విదితమే. అందులో భాగంగా సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఫోన్ చేసి 115 మంది తమ ఫిర్యాదులను తెలియజేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరెంటెండెంటు ఎన్.అప్పా రావు, సూపర్ వైజర్ భాస్కరరావు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## జీవనసరళి

ఆరునెలలుగా నెలకొన్న ప్రత్యేక పరిస్థితులు మనుషులను ఒక్కో విధంగా బాధిస్తున్నాయి. ఉపాధి ఉద్యోగాల మీద, వ్యాపారాల మీద పడిన దెబ్బలు ఒక ఎత్తు. మనుషుల సంచారం మీద, మానవ సంబంధాల మీద, అభిరుచుల మీద, మొత్తంగా జీవనసరళి మీద కనిపిస్తున్న ప్రభావం మరొక ఎత్తు. ఒక రకమైన జీవితానికి అలవాటు పడినవారు అకస్మాత్తుగా కొత్త ఆపదలకు, కొత్త పరిస్థితులకు సిద్ధపడవలసి వచ్చింది. ఒక వైరస్ కారణంగా ఏర్పడిన ఈ సన్నివేశాన్ని దాటుకున్న తరువాత మనుషులు మళ్లీ మునుపటిలాగా మారిపోతారా? స్థితిగతులు మళ్లీ పూర్వస్థితికి చేరుకుంటాయా? సినిమాహాళ్లు మూతపడడంతో, ఆధునిక భారతీయ జీవనసరళిలో ఒక ముఖ్యమైన అంశం మాయమైనట్టు అయింది. సినిమాహాల్‌కు వెళ్లడమంటే, కేవలం సినిమా చూడడమే కాదు, అదొక విహారం. కుటుంబంతో వెళ్లే వాళ్లకయినా, స్నేహితులతో వెళ్లే వాళ్లకయినా అది వినోదంలో భాగం. దాని చుట్టూ అనేక ఇతర ఉప అంశాలు ముడిపడి ఉంటాయి. ఆ సమయంలో మనుషులు తాము పని చేస్తున్నామనో కష్టపడుతున్నామనో కాక, జీవితాన్ని అనుభవిస్తున్నామని అనుకుంటారు. ఇప్పుడు సినిమాలను మరో రూపంలో చూస్తూ ఉండవచ్చు. కలిగిన వారు పెద్దపెద్ద తెరలు కలిగిన స్మార్ట్ టీవీలలో హోమ్ థియేటర్ హంగులతో ఓటీటీ వేదికల మీద చూస్తూ ఉంటారు. మధ్యతరగతి వారు కేబుల్ టీవీ, డిటిహెచ్ వేదికలను ఆనందించగలుగుతారు. అధిక సంఖ్యాకులు, తమ ఇరుకు నివాసాలలోనే, చిన్న తెరల టీవీల మీదికే ఉన్నత స్థాయి పరికరాలను జోడించి, వినోదాన్ని చూడడానికి ప్రయత్నిస్తారు. ఎప్పటికప్పుడు తాజాగా కొత్తకొత్త వినోదాలను అందించే పరిశ్రమ కూడా మూతపడడం వల్ల, కొత్త సినిమాలు లేక, కొత్త సీరియళ్లు రాక కొంత ఇబ్బంది కలిగింది. అప్పుడిక, తప్పనిసరిగా వినోదాన్ని వెదుక్కోవలసి వచ్చింది. ఇంగ్లీషు సినిమాలు, మలయాళ సినిమాలు, తమిళ సినిమాలు వెదుక్కుని వెదుక్కుని మరీ చూశారు. వాట్సప్‌లలో, ఫేస్‌బుక్‌లలో తాము చూసిన సినిమాల సంగతులను షేర్ చేసుకుని, వాటికి ప్రచారం కల్పించారు. రేపు, మళ్లీ సినిమాహాళ్లు తెరుచుకుంటే, కొత్త సినిమాలు వస్తే, ఈ మధ్యకాలంలో అలవాటు తప్పిన, అభిరుచి పెరిగిన ప్రేక్షకులు ఈ హీరోలను, ఈ కథలను, ఈ సినిమాలను ఇష్టపడతారా? వైరస్ భయం ఇంకా మిగిలి ఉంటే, దాని గురించి భయపడడం కాక, నాణ్యతా కారణాలతో మన సినిమా ఉత్పత్తులను, వినోద చానెళ్ల ఉత్పత్తులను ఇష్టపడకపోతే? అదే జరగాలి. అప్పుడే మన వినోద కార్యక్రమాల స్థాయి పెరిగే అవకాశం ఉన్నది. మూస, వెకిలి, నీచ, హీన అభిరుచులు మాయమయ్యే అవకాశమూ ఉన్నది. వార్తా పత్రికలకు కూడా కొంత ప్రమాదం ఏర్పడింది. కరోనా వచ్చిన కొత్తల్లో ఉన్న రకరకాల అపోహల వల్ల వార్తాపత్రికలను తెప్పించుకోవడానికి కొందరు భయపడ్డారు. బయటికే వెళ్లకుండా, తలుపులు మూసుకుని జీవించే రోజుల్లో, పత్రికలు మాత్రం అవసరమా అనిపించడం సహజమే. కానీ, ఏం జరుగుతుందో తెలియాలి, ఎప్పటికి నిష్కృతో తెలియాలి, జబ్బు మనదాకా వస్తే ఎక్కడికి వెళ్లాలో ఏమి చేయాలో సమాచారం కావాలి కదా. వార్తాపత్రికలను దూరం చేసుకుంటే మరో ప్రత్యామ్నాయం ఉండాలి కదా? తెలుగు సినిమాలు ఆగిపోతే, మలయాళ సినిమాలు చూసి అభిరుచి పెంచుకున్నట్టు, పత్రికలకు బదులు మరో ఉన్నతాభిరుచి వేదిక కావాలి. దురదృష్టవశాత్తూ, అటువంటివేవీ లేవు. పత్రికల అదృష్టవశాత్తూ, టీవీ న్యూస్ చానెళ్లు, సామాజిక మాధ్యమాలు నమ్మకానికి బారెడు దూరంలో, అసత్యాలకు, ఆవేశాలకు వేదిక అవుతున్నాయి. అందువల్ల, దూరమైన పాఠకులు పత్రికలకు తిరిగి దగ్గర కాక తప్పలేదు. ప్రపంచాన్నంతా మన చేతుల్లోకి తీసుకోవడానికి, నిశితంగా విశ్లేషించే మనసుని సంతృప్తి పరచడానికి పత్రికను మించినది ఏమున్నది? ఈ కరోనా కాలంలో పుస్తక ప్రచురణ కర్తలు, విక్రేతలు, ఆ రంగంలో ఉన్న సిబ్బంది అంతా చాలా ఇబ్బందులు పడుతున్నారు. చదువుకున్నవారు ఎలక్ట్రానిక్ పఠన ఉపకరణాలతో ఎక్కువ సమయం గడుపుతున్నారు. మనుషుల మధ్య చర్చలకైనా, సమావేశాలకైనా, చివరకు చదువుకోవడానికైనా స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్లెట్లే ఉపయోగిస్తున్నారు. ఈ పరిస్థితిని దాటాకా, తిరిగి మనుషులు మామూలు భౌతిక సమావేశాలు పెట్టుకుంటారా? తిరిగి భౌతికమయిన పుస్తకాలు చదువుతారా? కరోనా కాలంలో, ఆన్‌లైన్‌లో పుస్తకాలు తెప్పించుకునే వారి సంఖ్య సంతృప్తికరంగానే ఉన్నదని వింటున్నాము. ఆశ్చర్యకరంగా, పుస్తకాల కోసం గూగుల్‌లో అన్వేషణలు ఈ మధ్య భారీగా పెరిగాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగానూ, అమెరికా, బ్రెజిల్ వంటి దేశాలతోను పోల్చినప్పుడు, భారతదేశంలో పుస్తకాల కోసం గూగుల్ అన్వేషణలు చాలా తక్కువే. కానీ, కరోనాకాలంలో ఈ అన్వేషణ బాగా పెరిగింది. పుస్తక అన్వేషణలు భారతదేశంలో దక్షణాది రాష్ట్రాలలో, మహారాష్ట్రలో, ఢిల్లీలో, ఉత్తరాఖండ్‌లో ఎక్కువ. గూగుల్ ట్రెండ్స్ డేటా ప్రకారం, కాల్పనిక సాహిత్యంలో ప్రేమ, ఉత్కంఠ అంశాల కథలు, నవలలను, కాల్పనికేతర వచనంలో ఆత్మకథలను ఎక్కువ మంది ఇష్టపడుతున్నారట. భౌతిక పుస్తకాలను ఇంటికి తెప్పించుకోవడం కంటే, ఇంటర్నెట్‌లో ఉచితంగా దొరికే డౌన్‌లోడ్స్ మీదనే ఆసక్తి ఎక్కువట. ఏమయితేనేం, పఠనం మీదకు దృష్టి మళ్లడం మంచిదే కదా?

## సెప్టెంబర్ 22 బహుముఖ ప్రజ్ఞాశీలి అడవి బాపిరాజు

1791 : ఒక ఆంగ్ల రసాయన శాస్త్రవేత్త మరియు భౌతిక శాస్త్రవేత్త మైకేల్ ఫెరడే జననం (మ.1867).
1930 : ప్రముఖ చలనచిత్ర నేపథ్యగాయకుడు ప్రతివాది భయంకర శ్రీనివాస్ జననం (మ.2013).
1952 : బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాంతంత్ర్య సమరయోధుడు, రచయిత, కళాకారుడు మరియు నాటక కర్త అడివి బాపిరాజు మరణం (జ.1895).
1977 : ప్రముఖ అనువాదకురాలు మరియు ప్రజాసేవకురాలు రామినేని రామానుజమ్మ మరణం (జ.1880).
2011 : భారత మాజీ టెస్ట్ క్రికెట్ క్రీడాకారుడు మన్సూర్ అలీ ఖాన్ పటౌడి మరణం (జ.1941)



అడివి బాపిరాజు (అక్టోబరు 8, 1895 – సెప్టెంబరు 22, 1952) బహుముఖ ప్రజ్ఞాశీలి. స్వాంతంత్ర్య సమరయోధుడు, రచయిత, కళాకారుడు, నాటక కర్త. తెలుగు దేశమంతటా విస్తృతంగా ప్రచారంలోనున్న "బావా బావా పన్నీరు" పాట ఈయన వ్రాసిందే. సన్నిహితులు, సమకాలీన సాహితీవేత్తలు ఈయన్ని ముద్దుగా "బాపి బావ" అని పిలిచేవారు. బాపిరాజు పశ్చిమ గోదావరి జిల్లా లోని భీమవరంలో అక్టోబర్ 8, 1895 న ఒక నియోగి బ్రాహ్మణ కుటుంబములో కృష్ణయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించాడు. భీమవరం హైస్కూలులో చదివి, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ లో బి.ఏ చదివి, మద్రాస్ లా కాలేజ్ లో బి.ఎల్ పట్టం పొంది, కొంతకాలం న్యాయవాద వృత్తి నిర్వహించిన తరువాత తన ఇతర వ్యాసంగాలలో కృషిని సాగించడానికి ఆ పనిని విరమించాడు. 1934 నుండి 1939 వరకు బందరు నేషనల్ కాలేజిలో అధ్యాపకునిగా (ప్రిన్సిపాల్ గా) పనిచేశాడు. 1944లో హైదరాబాదు నుండి వెలువడే తెలుగు దినపత్రిక మీజాన్ సంపాదకునిగా పనిచేశాడు. తరువాత విజయవాడ ఆకాశవాణి రేడియో కేంద్రంలో సలహాదారునిగా ఉన్నాడు. 'నవ్య సాహిత్య పరిషత్' స్థాపించిన వారిలో బాపిరాజు ఒకడు. చిత్రకళను నేర్పడానికి గుంటూరులో ఒక ఫౌండేషన్ ప్రారంభించాడు. బాపిరాజుకు చిన్ననా టినుండి కవితలు రాసే అలవాటు ఉండేది. బాపి రాజు నవల నారాయణరావుకు ఆంధ్ర విశ్వకళా పరిషత్ అవార్డు లభించింది. ఆయన చిత్రించిన చిత్రాలలో 'సముద్ర గుప్తుడు', 'తిక్కన' ప్రసిద్ధమయ్యాయి. విశ్వనాథ సత్యనారాయణ గేయ సంపుటి కిన్నెరసాని పాటలు బాపిరాజు చిత్రాలతో వెలువడింది. 1922లో సహాయ నిరాకరణోద్యమంలో ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభ వించాడు. తన జైలు జీవితానుభవాలను 'తొలకరి' నవలలో పొందుపరచాడు. సెప్టెంబరు 22, 1952 న బాపిరాజు మరణించాడు. నవరంగ సంప్రదాయ రీతిలో అడివి బాపిరాజు ఎన్నో చిత్రాలను చిత్రించారు. బాపిరాజు చిత్రించిన శబ్ద బ్రహ్మ అనే చిత్రం డెన్మార్కు ప్రదర్శనశాలలో ఉంది. భాగవత పురుషుడు, ఆనంద తాండవం మొదలగు చిత్రాలు తిరువాన్‌కూరు మ్యూజియంలో ఉన్నాయి. 1951లో అప్పటి మద్రాసు ప్రభుత్వం కోరికపై సింహళంలోని సిగిరియా కుడ్య చిత్రాల ప్రతికృతులను చిత్రించారు.


## జమదగ్నినకి ముంగిస జన్మ!



'తన కోపమే తనకు శత్రువు'. అందుకే, చాలామంది కోప రహితులుగా వుండాలని అనుకొంటారు. కానీ, 'పూర్తిగా కోప రహితులు కావడమూ నష్టదాయక మేనని' వెల్లడించే కథ ఇది. పరశురాముడు తన తండ్రి జమదగ్నిలోని కోపాన్ని పూర్తిగా పోగొట్టాలను కొంటాడు. కానీ, వారి పితృదేవతలు కథను మరో మలుపు తిప్పుతారు. ఏం జరిగిందో చదవండి: పరశురాముని తల్లి రేణుక చేసిన చిన్న తప్పు (నదిలో జలకాలాడే రాజదంపతులకేసి ఆనందంగా చూడ టం)కే తండ్రి జమదగ్నికి పట్టరాని కోపం వస్తుంది. వెంటనే ఆమె తలను నరికేయమని నలుగురు కొడుకులను ఆదేశి స్తాడు. వారు 'మాతృహత్య మహాపాపమని' తిరస్కరిం చడంతో, అయిదో కొడుకు పరశురాముడిని ఆదేశిస్తాడు. పరశు రాముడు మారుమాట్లాడక తన గొడ్డలితో తల్లి తలను నరికేస్తాడు. 'తన మాటను ధిక్కరించిన నలుగురు అన్నల తలలూ నరకమని' జమదగ్ని ఆదేశించగానే పరశురాముడు వారి తలలూ నరికేస్తాడు. కోపం తగ్గిన తర్వాత జమదగ్ని కొడుకు పరశురాముణ్ణి ఏదైనా కోరిక కోరుకోమంటాడు. అప్పుడు, తన తల్లి ని, అన్నలను బతికించమంటాడు. వారికి మహర్షి ప్రాణం పోస్తాడు. ఇక్కడితో కథ అయిపోలేదు. పరశురామునికి మరో వరమియ్యాలనిపించింది జమదగ్నికి. 'కోరుకో'మం టాడు. "తండ్రీ! నా చేతిలో హతమైన ఐదుగురినీ బతికింపచేశారు. మన కుటుంబంలోకి ఆనందం తిరిగి వచ్చింది. కానీ, కొద్ది తడవైనా సరే, ఈ కుటుంబంలో దుఃఖం తాండవించింది. ఆవేదన, ఆందోళన రాజ్యమేలాయి. మీ క్రోధమే దానికి కారణం. ఇక నుండి మీరు నా కోసం ఈ కోపాన్ని వదిలిపెట్టాలి. ఇది నా ప్రార్థన" అన్నాడు పరశు రాముడు. "తథాస్తు" అన్నాడు తండ్రి. ఇది జరిగిన కొన్నాళ్లకు ఒకానొక రోజు వాళ్లింట్లో పితృకార్యం వచ్చింది. ఆ నిమిత్తం స్వయంగా ఆవు పాలు పితికి ఒక కొత్త కలశంలో భద్రపరిచాడు జమదగ్ని. 'క్రోధ దేవత' పొరపాటు అనిపించేలా, కావాలనే పాల కలశాన్ని తన్నింది. పాలు ఒలికి పోయాయి. విషయాన్ని గ్రహించికూడా మిన్నకుండి పోయాడు జమదగ్ని. క్రోధ దేవత జమదగ్ని వద్దకు వచ్చి, "భృగువంశం వారికి కోపం ముక్కుమీదే వుంటుంది. నువు ఇందుకు మినహాయింపుగా వు న్నావు. మహర్షీ! నన్ను క్షమించు. క్షీరాన్ని నేనే ఒలకపోశాను" అన్నది. "విధి లిఖితాన్ని ఎవరూ తప్పింప లేరు. నువు మటుకు ఏం చేయగ లవు. వెళ్లిపో" అన్నాడు జమదగ్ని. పితృకార్యాన్ని శ్రద్ధగా నిర్వహించాడు జమదగ్ని. కాని, పాలు లేని లోటు అట్లే వుండిపోయింది. ఆ రాత్రి పితృ దేవతలు జమదగ్నికి కలలో కనిపిం చారు. "క్రోధ దేవత కావాలని కాలితో తన్ని పాలను వొలకపోసిం ది. నీవామెను క్షమించి వదిలేశావు. నీవామెను శపించి ఉండాల్సింది" పితృదేవతల గొంతులో కోపం ధ్వనించింది. "తాపసికి కోపం పనికిరాదన్న ఉద్దేశ్యం తో నేను క్రోధదేవతను శపించలేదు" అన్నాడు జమదగ్ని. "కోపగించవలసిన చోట కోపానికి రాకపోవ డమూ దోషమే. 'యాదేవీ సర్వభూతేషు క్రోధరూపేణ సంస్థితా! నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః' అన్న దేవీస్తుతిని వినలేదా? క్రోధం స్వయంగా జగన్మాత స్వరూపం. చెడును శిక్షించేందుకు కోపం అనివార్యం" అన్నారు పితృదేవతలు. "కోపం రాకపోవడం దోషమంటారా?" అడిగాడు జమదగ్ని. "నిస్సందేహంగా. దౌష్ట్యాన్ని రూపుమాపడానికి, నేరస్తుణ్ణి శిక్షించడానికి క్రోధాన్ని ఉపయోగించాలి. దోషిని సంస్కరించడానికి కోపాన్ని వినియోగించాలి. క్రోధం నీ అధీనంలో ఉండాలి. నువు కోపానికి లోబడకూడదు. కోపం నీకు ఉపకరణం కావాలి. అంతేకానీ, కోపం చేతిలో నువు ఆయుధం కాకూడదు. లోకక్షేమం కోసమే నీ కోపం ఉపయోగపడాలి. నీ అహాన్ని సంతృప్తి పరచుకొనేందుకు కాదు" అన్నారు పితృదేవతలు. "తండ్రులారా! నా సందేహాన్ని పటాపంచలు చేశారు. నా దోషాన్ని క్షమించండి" వినయంగా చెప్పాడు జమదగ్ని. "నువు చేసిన తప్పు క్షమార్హం కాదు. మరుజన్మలో నువు ముంగిసవై పుడతావు" శపించారు పితృదేవతలు. "పితృదేవతలారా! ఇది నేను తెలిసి చేసిన తప్పు కాదు. నాకు శాప విమోచనాన్ని ప్రసాదించండి" ప్రార్థించాడు జమదగ్ని. 'దోషరహితులైన బ్రాహ్మణులు స్వార్థరహితంగా పలికిన సాధువాక్యాలను ఆక్షేపించినపుడు నువు ముంగిస రూపం వదిలి నిజరూపాన్ని పొందుతావు" చెప్పి అంతర్థానమై పోయారు పితృదేవతలు. అలా, ముంగిస జన్మనెత్తిన జమదగ్ని అనేక ఏండ్లపాటు ఆ రూపంలో ఉండి, ధర్మరాజు చేసిన అశ్వమేథ యాగాన్ని బ్రాహ్మణులు వేనోళ్ల కొనియాడుతుంటే, ఆ యాగాన్ని తక్కువ చేసి మాట్లాడి శాప విమోచనాన్ని, ఆ పైన జన్మ రాహిత్యాన్ని పొందాడు. మహాత్ములు శాపగ్రస్తులైనా లోకకళ్యాణానికే పాటుపడతారనడానికి ఈ కథ ఒక ఉదాహరణ.

## దశరథునికి కనిపించిన దృశ్యం

(నిన్నటి తరువాయి)



మరణిస్తున్నా, నా కొరకు నేను బాధపడడం లేదు. అంధులు, వృద్ధులు నా తల్లిదండ్రుల గురించే నా బాధంతా. వారికి ఇక దిక్కెవరు? ఒకే బాణంతో ముగ్గురిని చంపిన పాపాత్ముడు ఎవడు? ఎక్కడ?"ఆ మాటలకి నా పరుగు ఆగిపోయింది. అచేతుణ్ణయి పోయాను. చేతిలో విల్లు నేల జారిపోయింది. ఏమీ పాలుపోలేదు. అయినా శక్తి కూడదీసుకున్నాను. తీరానికి చేరి, చూశాను. గుడ్డి వెలుగులో ఎవరో మునికుమారుడు, గుండెల్లో గుచ్చుకున్న బాణంతో విలవిల్లాడుతూ కనిపించాడు. రక్తం కాలువగా ప్రవహిస్తోంది. అతని జటలు చెల్లాచెదురయి ఉన్నాయి. అతని పక్కన నీటి కుండ ఉంది. తట్టుకోలేక పోయాను దేవీ! ఆ దృశ్యాన్ని చూసి నిలువునా నీరయిపోయాను." అన్నాడు దశరథుడు."తర్వాత ఏమయింది స్వామీ?" ఆందోళన చెందింది కౌసల్య. తర్వాతేం జరిగిందో చెప్పను, చెప్పలేనన్నట్టుగా చేతుల్లో ముఖాన్ని దాచుకుని రోదించసాగాడు దశరథుడు. అరణి దశరథుని మరణం: భరతుని విషాదం రాముడు అడవుల పాలయ్యాడని సుమంత్రుడు చెప్పడంతో కౌసల్య రగిలిపోయింది. దశరథుణ్ణి నానా మాటలూ అన్నది. ఆమె కడుపు మంటను అర్థం చేసుకున్నాడు దశరథుడు. తను చేసిన పాపం ఏమిటి? ఎందుకిలా జరిగిందన్నది ఆలోచించసాగాడు. అప్పుడతనికి ముని కుమారుని మరణంగుర్తుకు వచ్చింది. ఆ మరణానికి తానూ, తను నేర్చుకున్న శబ్దవేధి విద్యా కారణం అంటూ, ఆనాడుజరిగిందంతా కౌసల్యకు చెప్పసాగాడు దశరథుడు. ఏనుగు అనుకుని తాను ప్రయోగించిన బాణం, ముని కుమారుని గుండెల్ని చీల్చిందని, ఆ దృశ్యాన్ని చూసి, దిగ్భ్రాంతి చెందానన్నాడతను. తర్వాత ఏమయ్యింది స్వామీ? ఆందోళనగా అడిగింది కౌసల్య. దశరథుడు చెప్పసాగాడిలా. "ముని కుమారుడు నన్ను నిలువునా దహించేట్టుగా చూశాడు. అడవిలో కందమూలాలు తింటూ ఋషిలా జీవిస్తున్న తాను ఎవరికి ఏ అపకారం చేశానని ప్రశ్నించాడు. ఎందుకు కూల్చావని అడిగాడు. తన తల్లిదండ్రులు దాహం అంటే నీరు తీసుకు వెళ్ళేందుకు వచ్చానన్నాడు. కడవ నీట ముంచుతూ బాణానికి బలయ్యానన్నాడు.'దాహంతో అల్లాడుతున్న నా తల్లిదండ్రులకు నా ఈ స్థితిని చెప్పేదెవరు? చెప్పి, ఆ అంధులనూ, వృద్ధులనూ ఇక్కడికి తీసుకువచ్చేదెవరు?' అడి గాడు. మౌనంగా రోదిస్తూ మాట్లాడక నిల్చున్న నన్ను చూశాడు. దగ్గరగా పిలిచాడు. భయం భయంగా సమీపించానతన్ని. 'దయచేసి, నువ్వే నా తల్లిదండ్రుల దాహార్తిని తీర్చు. ఈ నీటికుండ పట్టుకుని, ఇదిగో ఈ కని పించే కాలిబాటలో వెళ్ళు. మా కుటీరం కనిపిస్తుంది.' అన్నాడు.'జరిగింది వివరించి, నా తండ్రిని శరణు వేడుకో! జరిగిందానికి ఎంతగానో చింతిస్తున్నానని చెప్పు. అతని పాదాలను ఆశ్రయించు. ప్రమాదం ఉండదు. లేకపోతే అతని శాపాగ్నికి దగ్ధం అయిపోతావు.' అన్నాడు.'నొప్పిని భరించలేకపోతున్నానయ్యా! గుండెల్లో గుచ్చుకున్న ఈ బాణాన్ని తొలగించి మరీ వెళ్ళు.' అన్నాడు. బాణాన్ని తీసేందుకు చేయిజాచి ఆగి పోయాన్నేను. బాణం తీస్తే అతను మరణిస్తాడు. బ్రాహ్మణుని చంపిన పాపం చుట్టుకుంటుందని ఆలోచించాను. నా అవస్థను గమనించాడు మునికుమారుడు. నవ్వుతూ అన్నాడిలా." ఆగాడు దశరథుడు. "ఏఉవన్నాడు స్వామీ? మునికుమారుడు ఏఉవన్నాడు?" దశరథుణ్ణి కుదుపుతూ ప్రశ్నించింది కౌసల్య."అంత బాధలోనూ అతనేఉవన్నాడో తెలుసా? 'బ్రహ్మహత్య చుట్టుకుంటుందని భయపడుతున్నావు కాబోలు! నీకు ఆ భయం అక్కరలేదు. నేను బ్రాహ్మణుణ్ణి కాను. నా తండ్రి వైశ్యుడు, నా తల్లి శూద్రస్త్రీ' అన్నాడు. స్పృహ కోల్పోయాడు. బాణాన్ని తొలగించక తప్పదనుకుంటూ, అతని గుండెల్లోంచి బాణాన్ని తొలగించాను. మరుక్షణంలో మరణించాడతను. పెద్దపెద్ద కళ్ళతో నన్నే చూస్తూ ప్రాణాలు విడిచాడేమో! ఆ కళ్ళవైపు చూసేందుకే భయపడ్డాను. మహాపాపానికి ఒడిగట్టాననుకుని, తలకొట్టుకుని బాధపడ్డాను. ఆఖరికి ధైర్యం కూడగట్టుకున్నాను. నీటి కడవ తీసుకుని, కుటీరానికి చేరుకున్నాను. దాహార్తిలో విలవిల్లాడిపోతున్న ఆ అంధులకు నీటి కడవ అందించాను. వారు నీరు తాగలేదు సరికదా, 'ఎవరు నువ్వు?' అంటూ ఆందోళన చెందారు.


(మిగతా రేపటి సంచికలో)

## చూయింగ్ గమ్‌తో బరువుకు చెక్!



బరువు తగ్గాలనుకునే వారికి చూయింగ్ గమ్ ఎంతగానో ఉపయోగపడుతుందట. ఆకలిగా ఉన్న వారు చూయింగ్ గమ్‌ను తింటే ఆకలి చచ్చిపోతుందట. ఈ విషయం ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో తేలింది. చూయింగ్ గమ్‌ను తినడం వల్ల ఒత్తిడి తగ్గుతుందన్న విషయం గతంలో నిర్వహించిన పలు పరిశోధనల్లో స్పష్టమైంది. టెన్షన్, ఆందోళన, ఒత్తిడిగా ఉన్న సమయంలో చూయింగ్ గమ్‌ను తింటే వెంటనే ఆ పరిస్థితి నుంచి బయట పడవచ్చని పరిశోధకులు అంటున్నారు. చూయింగ్ గమ్‌లను తినడం వల్ల మెదడు పనితీరు పెరుగుతుందనీ, ఏకాగ్రతగా పనిచేస్తారని 2004లో చేసిన పరిశోధనల్లో వెల్లడైంది. అలాగే ఆకలిగా ఉన్న సమయంలో చూయింగ్ గమ్‌ను తింటే ఆకలి చచ్చిపోతుందట. అందువల్ల ఆహారం తక్కువగా తీసుకుంటారు. ఫలితంగా శరీరానికి అందే క్యాలరీలు కూడా తగ్గుతాయి. దీంతో అధిక బరువు తగ్గుతారు. కాకపోతే ఈ విషయం మీద ఇంకా పరిశోధనలు నిర్వహించాల్సి ఉందని పరిశోధకులు చెబుతున్నారు.

## రక్తపోటు, మధుమేహం ఉందా? కిడ్నీ పరీక్షలు తప్పనిసరి




మన శరీరంలో కిడ్నీలను చాలా సంక్లిష్టమైన, కీలకమైన అవయవాలుగా చెప్పుకోవచ్చు. అవి శరీరంలో విషతుల్యమైన పదార్థాలను మూత్రం ద్వారా వడపోసి బయటకు విసర్జింపజేస్తాయి. అంతేకాదు.. కీలకమైన హార్మోన్లు, ఎంజైమ్‌లను కూడా విడుదల చేస్తుంటాయి. అలాంటి కిడ్నీలను జాగ్రత్తగా కాపాడుకోవాలంటే ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలి. చిక్కుడు గింజ ఆకృతిలో ఉండే కిడ్నీల్లో ఎడమవైపుది కొంచెం పెద్దగా ఉండి, కుడివైపు దాని కన్నా కొంచెం పైకి ఉంటుంది. దాదాపు 150 గ్రాముల వరకు బరువుండే కిడ్నీలు 11-14 సెం.మీ. పొడవు, 6 సెం.మీ. వెడల్పు, 4 సెం.మీ. మందంతో ఉంటాయి. రక్తంలోని వ్యర్థాలను తొలగించడంతోపాటు రక్తపోటును నియంత్రించడంలోనూ కిడ్నీలది ప్రధాన పాత్ర. అందుకే బీపీ ఎక్కువగా ఉంటే కిడ్నీ పరీక్షలను కూడా పూర్తిగా చేయించుకోవాల్సి ఉంటుంది. అంతేకాకుండా మధుమేహంతో బాధపడేవారికి మూత్రపిండాలు వైఫల్యం చెందే ప్రమాదం ఎక్కువ. కాబట్టి ఎప్పటికప్పుడు కిడ్నీ ఫంక్షన్ టెస్ట్‌లు చేయించుకుంటూ ఉండడం తప్పనిసరి. కిడ్నీలకు సంబంధించి నాలుగు రకాల సమస్యలు తలెత్తుతూ ఉంటాయి.

**కిడ్నీ ట్యూమర్స్, కిడ్నీ క్యాన్సర్లు.**

మహిళల్లో ఎక్కువగా కనిపించే బ్యాక్టీరియల్ యూరినరీ ఇన్‌ఫెక్షన్లు కిడ్నీల వరకు పాకి ఇన్‌ఫెక్షన్లకు గురిచేస్తుంటాయి. యాంటీబయాటిక్స్‌తో ఈ సమస్య తొలగిపోతుంది. పురుషుల్లో ఎక్కువగా కనిపించే కిడ్నీలో రాళ్లు అనేక రకాలు ఉండడంతో పాటు ఇసుక రేణువుల పరిమాణం మొదలు కొని గోల్ఫ్‌బాల్ సైజు వరకు ఉంటాయి. అంత ప్రమాదకరం కాకపోయినా తీవ్రమైన నొప్పి, బాధను కలిగించే ఈ స్టోన్స్‌కు సైజును బట్టి అనేక రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అధిక బరువు, స్మోకింగ్, ఆల్కహాల్, రక్తపోటు, షుగర్ లెవల్స్ అదుపులో లేకపోవడం వల్ల ఆ దుష్ప్రభావాలు కిడ్నీల మీద పడి అది కిడ్నీ ఫెయిల్యూర్ సమస్యకు దారితీయవచ్చు. కిడ్నీలు ఫెయిల్ అయినపుడు మాత్రమే లక్షణాలు బయటపడుతుంటాయి. అందుకే దీన్ని సైలెంట్ డిసీజ్‌గా చెప్పుకోవచ్చు.


సెల్లుసేతి నుంచి కళ్ళప్పగించియు
మూతి బిగియబట్టి, ముందుకొంగి
ఎంతనేర్పుజూప
కొంతయు తలకెక్క
కుండె! నానులైను
గొప్ప చదువె!




– మల్లాది సోమేశ్వర శర్మ,
9603995769


రచయిత, సంఘ సంస్కర్త,హేతువాది,
అభ్యుదయ కవితా పితామహుడులి కన్యాశుల్కం
నాటక రచయిత...
దేశమును ప్రిమించుమన్నా...
మంచియన్నది పెంచుమన్న అని చాటి చెప్పిన...
శ్రీ గురజాడ అప్పారావు గారి జయంతి శు
భాకాంక్షలు...!!!

చూసి రమ్మంటే... కాల్చి వచ్చాడని అందరూ
"హనుమంతుడిని" అంటారు. కానీ ముందుగా
తన తోకను కాలిస్తేనే అతను "లంక" ను
కాల్చాడు అని చెప్పరు. తప్పుడు మాటలు
మాట్లాడే మనుషులు ఎప్పుడూ ఇలాగే చెప్తారు.
ముందు వాళ్ళు ఏమన్నారో అది చెప్పరు, మనం
ఏమి అన్నామో అది మాత్రమే...వాళ్ళ
మాటలతోనో రాతలతోనో,
ప్రచారం చేస్తారు. అలాంటి
వాళ్ళతో కొంచెం జాగ్రత్త
అవసరం..



– నగేష్‌వర్మ,
విశాఖపట్నం





# ఆదిత్య మ్యూజిక్ ద్వారా రెచ్చిపోదాం బ్రదర్



ప్రచోదయ ఫిల్మ్స్ పతాకంపై కిరణ్, అతుల్ కులకర్ణి ప్రధాన పాత్రదారులుగా ఏ. కె. జంపన్న దర్శకత్వంలో.. వివి లక్ష్మీ, హనీష్ బాబు ఉయ్యూరు సంయుక్తంగా నిర్మించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రెచ్చిపోదాం బ్రదర్'. అన్ని హంగులతో ముస్తాబైన ఈ చిత్రానికి సాయి కార్తీక్ స్వరాలను అందించారు. కాగా ఈ చిత్ర లిరికల్ సాంగ్‌ను సోమవారం ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేసారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఏ. కె. జంపన్న మాట్లాడుతూ.. "అన్ని కమర్షియల్ హంగులున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. మా చిత్రానికి మెయిన్ హైలైట్ సాయికార్తీక్‌గారు అందించిన సంగీతం. అలాగే ఆయన అందించిన రీ రికార్డింగ్ ఆడియన్స్‌ను మెస్మరైజ్ చేస్తుంది. అలాగే మా చిత్రంలో హీరో కిరణ్, అతుల్ కులకర్ణి మధ్య సాగే సన్నివేశాలు ఉత్కంఠభరితంగా ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. ఇటువంటి మంచి చిత్రానికి వర్క్ చేసే అవకాశమిచ్చిన దర్శకనిర్మాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.." అన్నారు. చిత్ర నిర్మాత హనీష్ బాబు ఉయ్యూరు మాట్లాడుతూ.. "నేటి వాస్తవిక పరిస్థితులకు ఎంటర్‌టైన్మెంట్ జోడించి అన్ని కమర్షియల్ హంగులతో రాబోతోన్న హిట్ చిత్రమిది. ఎమోషన్, యాక్షన్, ఎంటర్టైన్మెంట్ సమపాళ్లతో ప్రేక్షకులకు ఆనందాన్ని పంచే చిత్రమిది. సాయి కార్తీక్ మ్యూజిక్, శ్యామ్ కె నాయుడు కెమెరా పనితనం, భాస్కరభట్ల లిరిక్స్ మా చిత్రానికి స్పెషల్ ఎట్రాక్షన్. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న మా చిత్ర ఆడియో నుంచి ఓ లిరికల్ సాంగ్‌ను నేడు ఆదిత్య మ్యూజిక్ ద్వారా రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది" అన్నారు. రవికిరణ్, అతుల్ కులకర్ణి, దీపాలి శర్మ, శివాజీరాజా, పోసాని, శశాంక్, భానుచందర్, ఇంద్రజ, బెనర్జీ, అజయ్‌గోష్, ప్రభాస్ శ్రీను, తాగుబోతు రమేష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: సాయి కార్తీక్, లిరిక్స్: భాస్కరభట్ల, కాసర్ల శ్యామ్, పూర్ణచారిబీ డి.ఓ.పి: శ్యాం.కె. నాయుడు, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్, ఫైట్స్: డ్రాగన్ ప్రకాష్, ఆర్ట్: మహేష్ శివన్, డాన్సు: భాను, పబ్లిసిటీ డిజైనర్: ధని ఏలే, పి.ఆర్.ఓ: వీరబాబు, ప్రొడ్యూసర్స్: వివి లక్ష్మీ, హనీష్ బాబు ఉయ్యూరు, స్టోరీ, డైలాగ్స్, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్: ఏ. కె. జంపన్న.

# భవిష్యత్తులో దర్శకత్వం



"జీవితంలో ప్రతి ఒక్కరూ ప్రేమలో పడాలని లేదు. అలాగే కచ్చితంగా పెళ్లి చేసుకోవాలనీ లేదు" అంటోంది నివేదా థామస్. 'జెంటిల్‌మెన్', 'నిన్నుకోరి', 'బ్రోచేవారెవరురా' లాంటి విభిన్న చిత్రాలతో తెలుగువారికి దగ్గరైన మలయాళీ తార నివేదా. పాత్రల ఎంపికలో ఆచితూచి వ్యవహరించే ఈ నాయికని 'ప్రేమ.. పెళ్లిపై మీ ఆలోచనలు ఎలా ఉన్నాయని అడిగితే?' తనదైన శైలిలో బదులిచ్చింది."ప్రేమ, పెళ్లి ప్రతి ఒక్కరి జీవితంలో చాలా ముఖ్యమైన విషయాలు. వాటి గురించి మాట్లాడటానికి నేనెప్పుడూ తటపటాయించను. పెళ్లి చేసుకునే సమయం వచ్చినప్పుడు సంతోషంగా చేసుకుంటా. ప్రస్తుతానికి నాకు పెళ్లి మీద ఆలోచనలు లేవు. ప్రేమించే తీరికా లేదు. నటిగా నేను నిరూపించుకోవల్సింది చాలా ఉంది. ఎన్నో విభిన్న పాత్రలు పోషించాలి. భవిష్యత్తులో దర్శకత్వం చెయ్యాలన్న కోరిక ఉంది" అని చెప్పింది. మరి 'కాబోయే జీవిత భాగస్వామిలో కోరుకునే లక్షణాలేంటి?' అంటే.. 'నిజాయితీగా ఉండే వాళ్లని ఇష్టపడతా. బాధ్యతలు పంచుకోగల వ్యక్తిగా ఉండాలి. ప్రయాణాల పట్ల మక్కువ ఉండాలి" అని చెప్పింది. ప్రస్తుతం ఈ భామ మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో 'వి' చిత్రంలో నటించింది. నాని, సుధీర్‌బాబు హీరోలుగా నటించారు.త్వరలో విడుదల కానుంది.

# షూటింగ్ పూర్తైన 'ఈ కథలో పాత్రలు కల్పితం'!



పవన్ తేజ్ కొణిదెల హీరోగా పరిచయం చేస్తూ మాధవి సమర్పణలో ఎంవిటి ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్ పై అభిరామ్ ఎం. దర్శకత్వంలో రాజేష్ నాయుడు నిర్మిస్తున్న థ్రిల్లింగ్ ఎంటర్టైనర్ 'ఈ కథలో పాత్రలు కల్పితం'. మేఘన, లక్కి హీరోయిన్స్. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్, సెకండ్ లుక్ పోస్టర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ లభించింది. చిత్ర హీరో పవన్ తేజ్ కొణిదెల ఈరోజు(ఆగస్ట్ 9) తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా నిర్మాత రాజేష్ నాయుడు మాట్లాడుతూ.. ఈ కథలో పాత్రలు కల్పితం షూటింగ్ పూర్తి అయ్యింది. టైటిల్ అనౌన్స్ చేసినప్పటి నుండి మా సినిమాకి పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. మా హీరో పవన్ తేజ్ కొణిదెలకి ఒక పర్ఫెక్ట్ లాంచింగ్ మూవీ అవుతుంది. మా దర్శకుడు అభిరామ్ మంచి విజన్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకునే థ్రిల్లింగ్ అంశాలతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'జెస్సీ', రీసెంట్ గా వచ్చిన 'ఓ పిట్టకథ' ..సినిమాలకి వర్క్ చేసిన సినిమాటోగ్రాఫర్ సునీల్ కుమార్ విజువల్స్, 'ఆర్ఎక్స్ 100', 'కల్కి' చిత్రాలకు డైలాగ్స్ రాసిన తాజుద్దీన్ సయ్యద్ మాటలు ఈ చిత్రానికి హైలెట్‌గా నిలవనున్నాయి, మా హీరో పవన్ తేజ్ కొణిదెలకు బర్త్‌డే విషెస్ తెలుపుతున్నాను అన్నారు. డైరెక్టర్ అభిరామ్.ఎం మాట్లాడుతూ.. చిత్రీకరణ పూర్తి చేసుకున్న మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు మొదలయ్యాయి, త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం. అలాగే టీజర్, పాటలు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. లేటెస్ట్ గా విడుదలైన థీమ్ పోస్టర్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న మా హీరో పవన్ తేజ్ కొణిదెలకు చిత్ర యూనిట్ తరుపున శుభాకాంక్షలు తెలుపుతున్నాము.. అన్నారు.

# గేర్ మారుస్తున్నాడు

సుశాంత్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇచ్చట వాహనములు నిలుపరాదు'. నో పార్కింగ్... అనేది ఉప శీర్షిక. ఎస్.దర్శన్ దర్శకత్వం వహిస్తున్నారు. రవిశంకర్ శాస్త్రి, ఏక్తా శాస్త్రి, హరీష్ కోయలగుండ్ల నిర్మాతలు. ఏఎన్నార్ జయంతి సందర్భంగా ఆదివారం ఈ సినిమా కొత్త ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. పోస్టర్‌పై 'గేర్ మార్చి బండి తియ్...' అని రాసి ఉంది. ఈ వారమే సినిమా చిత్రీకరణని పునః ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కథానాయకుడు సుశాంత్ ట్విటర్ ద్వారా ఏఎన్నార్‌ని గుర్తు చేసుకున్నారు. 'మార్చి పోయి సెప్టెంబర్ వచ్చింది. గేర్ మార్చి బండి తియ్' అంటూ సినిమా గురించి ట్వీట్ చేశారు. వెన్నెల కిశోర్, ప్రియదర్శి, అభినవ్ గోమటం, ఐశ్వర్య, నిఖిల్ కైలాస, కృష్ణచైతన్య నటించిన ఈ సినిమాకి సంగీతం: ప్రవీణ్ లక్కరాజు, సంభాషణలు: సురేష్‌బాబా–భాస్కర్.ఆర్, ఛాయాగ్రహణం: ఎం.సుకుమార్.




# దేవదాసిగా సాహసం!



'ఉయ్యాల జంపాలా', 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' చిత్రాల్లో ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించి మెప్పించిన పునర్నవి.. 'పిట్టగోడ', 'ఎందుకు ఏమో' చిత్రాల్లో హీరోయిన్‌గా మెరిసింది. ఇక బిగ్ బాస్ షోతో పాపులర్ అయ్యింది. ప్రస్తుతానికి గాసిప్ గానే ఉన్న ఈ వార్త నిజం కావాలి కాని.. బిగ్ బాస్ బ్యూటీ పునర్నవి పంట పండినట్టే. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాలో నటించడం అనేది చాలామంది హీరోయిన్ల కల.. అయితే పూర్తి స్థాయిలో హీరోయిన్ కాలేకపోయిన పునర్నవి పవన్ కళ్యాణ్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం అంటే బంపర్ ఆఫర్ గానే పరిగణించాలి. అజ్ఞాతవాసి సినిమా తరువాత పవన్ కళ్యాణ్ సినిమాలు చేయడం మానేయడం.. రాజకీయాల్లో ఫుల్ టైం పొలిటీషియన్‌గా మారడం.. తిరిగి ఎన్నికల తరువాత ఆర్థికపరమైన ఇబ్బందులున్నాయంటూ సినిమాల్లోకి రావడంతో పవన్ కళ్యాణ్ రీ ఎంట్రీ సినిమాల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే పవన్ కళ్యాణ్ సినిమాలో ఛాన్స్ కొట్టిందట పునర్నవి. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ పింక్ రీమేక్ 'వకీల్ సాబ్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ చిత్రం తరువాత పవన్ కళ్యాణ్.. క్రిష్ దర్శకత్వంలో మరో సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. 1870 నాటి పరిస్థితుల నేపథ్యంలో పీరియాడిక్ డ్రామాగా క్రిష్ అద్భుత కథను రెడీ చేసినట్టు తెలుస్తోంది. ఈ సినిమాలో రాబిన్ హుడ్ తరహా పాత్రలో పవన్ కళ్యాణ్ కనిపించనుండగా.. ఈ చిత్రానికి 'విరూపాక్ష' అనే పవర్ ఫుల్ టైటిల్ ప్రచారంలో ఉంది. ఇక ఈ సినిమాలో పవన్‌కి జోడీగా బాలీవుడ్ హాట్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ నటించనుంది.

# రీమేక్.. జిందాబాద్!



రీమేక్.. ఇది టాలీవుడ్‌లో ఓ బ్రహ్మ పదార్థం. ఎందుకంటే రీమేక్ సినిమాలు కూడా ఒరిజినల్ సినిమాల తరహాలోనే లాటరీ తరహాలో ఆడుతున్నా మనవాళ్ల దృష్టి ఎప్పుడూ పరభాషా చిత్రాలపైనే. రీమేక్‌లు టాలీవుడ్ డైరెక్టర్ల క్రియేటివిటీని ఎదగనీయకుండా చేస్తున్నాయని కొందరు వాదిస్తే, ఏ లాంగ్వేజ్‌లో వచ్చిన సినిమా అయినా చివరకు ప్రేక్షకులను ఆకట్టుకోవాల్సిందే కదా అనేది మరికొందరి అభిప్రాయం. ఎవరి అభిప్రాయం ఎలా ఉన్నా ఈ రీమేక్‌లో జోరు తెలుగుతెరపై నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. ఇటీవలి కాలంలో ఒక్క భాష అని కాకుండా అనేక భాషల నుంచి తెలుగులో రీమేక్‌లు వస్తున్నాయి. ఎక్కువగా తమిళ, హిందీ భాషల నుంచి ఎక్కువ సినిమాలు వస్తుంటే, ఓ బేబీ తర్వాత కొరియన్ సినిమాల మీద మనవాళ్ల దృష్టి మళ్లింది. ఇటీవలి కాలంలో అంటే 2018 నుంచి తీసుకుంటే.. తమిళం నుంచి గద్దలకొండ గణేష్, చీకటి గదిలో చితక్కొట్టుడు, బ్లఫ్ మాస్టర్, అర్జున్ సురవరం, జాను, కౌసల్య కృష్ణమూర్తి, నెక్ట్స్ నువ్వే, సిల్లీ ఫెలోస్, రాక్షసుడు, రాజుగారి గది 3, మలయాళం నుంచి ఏబీసీడీ, ఫలక్‌నుమా దాస్, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య, కన్నడం నుంచి ఫస్ట్ ర్యాంక్ రాజు, ఆటగదరా శివ, కిర్రాక్ పార్టీ, యు టర్న్, హిందీ నుంచి నెక్స్ట్ ఏంటి, పంజాబీ నుంచి హ్యాపీ వెడ్డింగ్, గుజరాతీ నుంచి ఎంత మంచివాడవురా లాంటి సినిమాలు రీమేక్ అయ్యాయి. వీటిలో 'గద్దలకొండ గణేష్', 'అర్జున్ సురవరం', 'రాక్షసుడు', 'ఫలక్‌నుమా దాస్' మాత్రమే హిట్టనిపించుకున్నాయి. 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఇటీవలే రిలీజైంది. ప్రస్తుతం విడుదల కోసం 'దటీజ్ మహాలక్ష్మి', 'ఏ1 ఎక్స్‌ప్రెస్', 'రెడ్' సినిమాలు ఎదురు చూస్తున్నాయి. బ్లాక్‌బస్టర్ హిందీ ఫిల్మ్ 'క్వీన్'కు రీమేక్‌గా 'దటీజ్ మహాలక్ష్మి' రూపొందింది. ఒరిజినల్‌లో కంగనా రనౌత్ చేసిన క్యారెక్టర్‌ను తెలుగులో తమన్నా పోషించింది. ఏడాదిన్నర క్రితమే పూర్తయినా విడుదలకు నోచుకోని ఈ చిత్రాన్ని ఓటీటీలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గత ఏడాది వచ్చిన తమిళ హిట్ మూవీ 'నట్‌పే తునై' ఆధారంగా సందీప్ కిషన్ 'ఏ1 ఎక్స్‌ప్రెస్' చేశాడు. లావణ్యా త్రిపాఠి నాయికగా నటించిన ఈ మూవీని థియేటర్లలోనే రిలీజ్ చేద్దామని నిర్మాతలు ఎదురు చూస్తున్నారు. అలాగే గత ఏడాదే వచ్చిన మరో తమిళ బ్లాక్‌బస్టర్ 'తాడమ్'ను రామ్ హీరోగా రీమేక్ చేశాడు డైరెక్టర్ కిశోర్ తిరుమల. ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సిన ఈ మూవీపై కరోనా దెబ్బపడి, థియేటర్లు ఎప్పుడు తెరుచుకుంటాయా అని ఎదురుచూస్తోంది. ప్రస్తుతం మేకింగ్‌లో మూడు భారీ రీమేక్స్ ఉన్నాయి. వాటిలో ఒకటి.. పవన్ కల్యాణ్ 'వకీల్ సాబ్' కాగా, మరొకటి వెంకటేశ్ 'నారప్ప', ఇంకొకటి కృష్ణవంశీ తీస్తున్న 'రంగమార్తాండ'. అమితాబ్ బచ్చన్ నటించిన హిందీ హిట్ ఫిల్మ్ 'పింక్'కు రీమేక్‌గా 'వకీల్ సాబ్' రూపొందుతోంది. మేలోనే దీన్ని రిలీజ్ చేయాలని నిర్మాత దిల్ రాజు ప్లాన్ చేయగా, మార్చి నుంచి షూటింగ్స్ ఆగిపోవడంతో, అది వీలు కాలేదు. పవన్ కల్యాణ్ మరో రెండు వారాలు షూటింగ్‌లో పాల్గొంటే సినిమా పూర్తవుతుంది. కరోనా వైరస్ ప్రభావం తగ్గేదాకా సెట్స్ మీదకు రానని ఆయన తేల్చేశారు. నారప్ప పరిస్థితి కూడా అంతే. తమిళ హిట్ ఫిల్మ్ అసురన్‌కు అది రీమేక్. ఇప్పట్లో రిస్క్ తీసుకొని షూటింగ్ చెయ్యాల్సిన పనిలేదనీ, పరిస్థితులు పూర్తిగా కుదుటపడ్డాకే మిగతా సీన్లు తీసుకుందామని వెంకటేశ్ డిసైడ్ అయ్యాడు. జాతీయ అవార్డ్ పొందిన మరాఠీ మూవీ 'నటసామ్రాట్'కు రీమేక్‌గా ప్రకాశ్‌రాజ్‌తో కృష్ణవంశీ తీస్తున్న 'రంగమార్తాండ'కు సంబంధించి కూడా షూటింగ్ బ్యాలెన్స్ ఉంది. నిజానికి రీమేక్స్ అనేవి సర్వసాధారణమే. పలు తెలుగు సినిమాలు కూడా ఇతర భాషల్లో రీమేక్ కావడం మనం చూస్తున్న విషయమే. అయితే వీటివల్ల నేటివిటీ ప్రాబ్లెమ్ రావడమే కాకుండా క్రియేటివిటీ కూడా దెబ్బతింటుందనడంలో సందేహం లేదు. జాను, కౌసల్య కృష్ణమూర్తి, కిర్రాక్ పార్టీ, ఎంత మంచివా డవురా లాంటి సినిమాలు ఫెయిలవడానికి ఇవే కారణం. అంతమాత్రాన రీమేక్స్ టాలీవుడ్ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని భయపడాల్సిన అవసరం లేదు. పరభాషా చిత్రాలను పరిశీలిస్తూనే మన క్రియేటివిటీని పెంచుకునే దిశగా పయనిస్తే తప్పకుండా అచ్చమైన మన కథలు అందర్నీ అలరిస్తాయి. దీనికి కావాల్సిందల్లా కుదురుగా ఆలోచించి, కొత్తదనం కోసం పరితపించడమే. ఎంతైనా ఒరిజినాలిటీ ఒరిజినాలిటీయే కదా...

# ఓటీటీ ద్వారా విడుదల సన్నాహాల్లో 'ప్రణవం'



చరిత అండ్ గౌతమ్ ప్రొడక్షన్స్ పతాకంపై 'ఈ రోజుల్లో' శ్రీ మంగం, శశాంక్, అవంతిక హరి నల్వా, గాయత్రి అయ్యర్ హీరో హీరోయిన్లుగా కుమార్ జి. దర్శత్వంలో తనూజ.ఎస్ నిర్మిస్తోన్న లవ్ అండ్ థ్రిల్లర్ చిత్రం 'ప్రణవం'. పద్మారావ్ భరద్వాజ్ సంగీతాన్ని సమకూర్చిన ఈ చిత్రంలోని పాటలు ఇప్పటికే విడుదలై సినిమాకు మంచి హైప్ తీసుకొచ్చాయి. చాలా కాలం తర్వాత ఇందులో ఆర్.పి.పట్నాయక్, ఉష కలిసి ఓ పాటను పాడటం విశేషం. అలాగే సునీత, అనురాగ్ కులకర్ణి పాడిన పాటలకు మంచి రెస్పా న్స్ లభిస్తోంది. ఇక పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఓటీటీ ద్వారా విడుదలకు సన్నాహాలు చేసుకుంటోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మాట్లాడుతూ... "ఈ రోజుల్లో' చిత్రంతో హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీ మంగం హీరోగా 'ప్రణవం' చిత్రం నిర్మించాం. మరో మారు హీరోగా తనేంటో నిరూపించుకునేలా ఈ సినిమా ఉంటుంది. ఇక దర్శకుడు కుమార్ కి ఇది తొలి సినిమా అయినప్పటికీ ప్రేక్షకుల ఆలోచనా విధానానికి తగ్గట్టుగా తెరకెక్కించారు. ప్రజెంట్ కొత్త కథలతో పోటీ పడి సినిమాలు చేస్తోన్న దర్శకుల లిస్ట్ లో మా దర్శకుడు కుమార్ కూడా చేరతారు అన్న నమ్మకంతో ఉన్నాం. కథకి తగ్గట్టుగా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాను చాలా రిచ్ గా నిర్మించాం. పాటలు, బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ బాగా కుదిరాయి. ఓటీటీ ద్వారా మా ప్రణవం చిత్రాన్ని రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. జెమిని సురేష్, నవీన, జబర్దస్త్ బాబి, దొరబాబు, సమీర, తదితరులు నటిస్తోన్న ఈ చిత్రానికి పిఆర్వో: వంగాల కుమార స్వామిబీ స్టిల్స్: శశాంక్ శేఖర్‌బీ డిఓపి: మార్గల్ డేవిడ్‌బీ కొరియోగ్రాఫర్: అజయ్‌బీ కో–డైరెక్టర్: శ్రావణ్ నల్లూరిబీ సంగీతం: పద్మనావ్ భరద్వాజ్‌బీ ఎడిటర్: సంతోష్‌బీ ఫైట్స్: దేవరాజ్‌బీ లిరిక్స్: కరుణ కుమార్, సిహెచ్ విజయ్‌కుమార్, రామాంజనేయులుబీ నిర్మాత: తనూజ.ఎస్‌బీ.

# మహాసముద్రంతో మరోసారి?



'ఆర్ఎక్స్ 100' వంటి హిట్ తర్వాత అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కనున్న కొత్త చిత్రం 'మహాసముద్రం'. శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్నారు. సిద్ధార్థ్ కీలక పాత్రను పోషిస్తున్నారు. సుంకర రామబ్రహ్మం నిర్మాత. గాఢతతో నిండిన చక్కటి ప్రేమకథతో రూపొందనున్న చిత్రమిది. యాక్షన్‌కు ప్రాధాన్యముంది. ఈ చిత్రంలో శర్వాకు జోడీగా కనిపించబోయే నాయిక కోసం సమంత, సాయిపల్లవి, అదితీరావు హైదరీ వంటి వారి పేర్లు వినిపించాయి. ఇప్పుడీ అవకాశం 'గ్యాంగ్‌లీడర్' భామ ప్రియాంక అరుళ్ మోహన్ అందుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం శర్వానంద్ హీరోగా చేస్తున్న 'శ్రీకారం' చిత్రంలోనూ ఆమే కథానాయికగా నటిస్తోంది. ఇప్పుడీ జోడీనే మరోసారి ఈ కొత్త చిత్రంతో కనువిందు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆమె ఈ కథకు అంగీకారం తెలిపిందని, మరికొద్ది రోజుల్లోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని సమాచారం. త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.

# తిరుపతి, నెల్లూరు, కర్నూలు, కడప




(మొదటి పేజి తరువాయి)



మీడియాలో వైరల్ అయ్యే సమాచారాన్ని నిర్ధారించుకునే సౌకర్యం కూడా ఉంది. ఈ యాప్‌లో మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా 12 మాడ్యూల్స్‌తో మహిళల కు రక్షణగా, తోడు నీడగా అన్ని వేళల్లో పోలీసులు తమకు రక్షణ ఉన్నారు అనే భావనతో వారిలో ఆత్మస్థైర్యాన్ని కల్పించే విధంగా ఈ యాప్ సేవలను అందిస్తుంది. తాడేపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌త్ పాటు డీజీపీ గౌతవ్ సవాంగ్ ముఖ్య పోలీసు అధికారులు పాల్గొన్నారు. యాప్ విశిష్టతను సీఎంకు వివరించారు. ఈ యాప్ ద్వారా పోలీసు వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలకనుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటలైజేషన్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఈ పోలీస్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు. డీజీపీ గౌతమ్ సవాంగ్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలోని మహిళలకు అన్ని సందర్భాలలో అందుబాటులో ఉండే విధంగా అత్యంత ఆధునిక టెక్నాలజీ తో ప్రవేశ పెట్టిన దిశ మొబైల్ అప్లికేషన్ (ఎస్ఓఎస్) స్వల్ప వ్యవధి లోనే పదకొండు లక్షల మంది డౌన్ లోడ్ చేసుకున్నారు. 568 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించగా 117 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసి చర్యలు తీసుకున్నాము. ఆపదలో ఉన్న మహిళలకు తక్షణమే పరిష్కరించటం కోసం ఇప్పటికే సైబర్ మిత్ర ప్రత్యేక వాట్సాప్ నెంబర్ 9121211100 మరియు ఫేస్ బుక్ పేజ్ అందుబాటులో ఉంది. ఇప్పటివరకు 1,850 పిటిషన్ లు అందగా 309 యఫ్.ఐ.ఆర్ లు నమోదు చేసి చర్యలు తీసుకున్నాము. సైబర్ నేరాలను నియంత్రించేందుకు అత్యాధునిక టెక్నాలజీతో సైబర్‌ల్యాబ్స్‌ను అందుబాటులోకి తెచ్చాము. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ కు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం.అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో కూడా రిమోట్ ఏరియా కమ్యూనికేషన్ ఎన్‌హాన్స్‌మెంట్ వెహికల్స్ (రేస్) విధానం అందుబాటులో ఉంద'న్నారు.

## నెరవేరనున్న పేద రైతుల కల: ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి


**కడప, వార్తావళి, సెప్టెంబర్ 21 :** పేద రైతులకు వై ఎస్ ఆర్ జలకళ ద్వారా ఉచిత బోర్లు వరంగా మారనున్నాయని ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు.పేద రైతులకు భూమి ఉండి బోరు వేస్తే నీళ్లు పడతాయన్న పరిస్థితుల్లో ఉచితంగా బోర్లను వైఎస్ఆర్ జలకళ పథకం ద్వారా ప్రభుత్వం వేయనుందన్నారు. పార్లమెంట్ నియోజక వర్గానికి ఒకటి, అసెంబ్లీ నియోజక వర్గానికి ఒకటి చొప్పున బోర్ వెల్ వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ఆ లెక్కన 25 పార్లమెంట్ నియోజక వర్గాలకు, 175 అసెంబ్లీ నియోజక వర్గాలకు మొత్తం 200 బోర్ వెల్ వాహనాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. వర్షాభావ పరిస్థితులతో వేసిన బోర్లు దెబ్బతిన్న పరిస్థితుల్లో పంటలను, తోటలను కాపాడుకునే నేపథ్యంలో అదనంగా బోర్లు వేయడానికి ఇంట్లోని బంగారాన్ని తాకట్టు పెట్టడం, అధిక వడ్డీలకు తెచ్చుకుని అప్పులపాలయిన రైతన్నల బాధలను తన సుదీర్ఘ పాదయాత్రలో కళ్లారా చూసిన జగన్ ఉచితంగా బోర్లు వేయిస్తామన్న హామీ ఇప్పుడు నెరవేరబోతుండడం శుభపరిణామన్నారు.రైతన్నల కోసం ఒకొక్క హామీని సీఎం జగన్ నెరవేరుస్తున్నారన్నారు.రైతులకంట కన్నీరు చూడకూడదన్న ఉద్దేశ్యంతో రైతు భరోసా కేంద్రాలు, పంటలకు మద్దతు ధర, విత్తనాలు, ఎరువులను సకాలంలో అందచేస్తూ రైతు పక్షపాతిగా సీఎం జగన్ పేరొందు తున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కరవు నివారణకు ఎన్నో చర్యలు చేపట్టి రైతు బాంధవుడిగా నిలిచారన్నారు. భగవంతుడి ఆశీస్సులతో ప్రస్తుతం వర్షాలు సంవృద్ధిగా కురుస్తున్నాయన్నారు.పేదల విషయంలో గొప్పగా ఆలోచించే ముఖ్యమంత్రి జగన్ క్రింద పనిచేయడం సంతోషంగా ఉందన్నారు.పేద రైతులందరికీ ఉచిత బోర్లు ఏర్పాటు చేయాలన్న సీఎం జగన్ ఆశలను, ఆలోచనలును పక్కదారిపట్టకుండా, దుర్వినియోగం కాకుండా ఖచ్చితంగా పేదలకందేలా పేదలకోసం కష్టపడి పనిచేస్తున్న నాయకులందరూ కృషి చేయాలని ఆయన కోరారు.108, 104 అబులెన్స్ లు 1200 వాహనాలను ఏక కాలంలో ప్రారంభించి ప్రపంచ చరిత్ర సృష్టించిన జగన్, ఈ నెల 28 న 200 బోర్ వెల్ వాహనాలను ప్రారంభించి పేద రైతుల కలను నెరవేర్చి మళ్లీ చరిత్ర సృష్టించనున్నారని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

## నిధులు మళ్లించే జిఓ 17ను రద్దు చేయాలి: ఎస్. రంగరాజు




**పూసపాటిరేగ, వార్తావళి, సెప్టెంబర్ 21:** రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ నిధుల నుండి ఇతర శాఖలకు నిధులు మళ్లించే ఈ విధంగాజారీ చేసిన జీవో నెంబర్ 17ను వెంటనే రద్దు చేయాలని ఏ.ఐ.టి.యు.సి జిల్లా కార్యదర్శి ఎస్. రంగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ను రద్దు చేయాలని, నిధులు మళ్లించి ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ అమర్ భవన్లో ఏ ఐ టి యు సి జిల్లా కార్యదర్శి బుగత అశోక్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు టీ. జీవన్, ఏపీ గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షులు తుమ్మి అప్పలరాజు దొర లతో జరిగిన మీడియా సమావేశం లో ఎస్.రంగరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు చేసిన సుదీర్ఘమైన పోరాటాల ఫలితంగా రాష్ట్రాలవారీగా వాళ్లకి ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పడిందని, సంక్షేమ బోర్డు ద్వారానే వాళ్ళ ప్రయోజనాలు, హక్కులు, పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, ఆనందరావు, రవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాక్సిన్ పై రాజ్యసభలో కేంద్రం స్పందన




క్లినికల్ ట్రయల్స్ విజయ వంతంగా పూర్తయితే వచ్చే ఏడాది మార్చి నాటికి కోవిడ్ వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నట్లు ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అశ్విన్ కుమార్ చౌబే వెల్లడించారు. రాజ్యసభలో ఆదివారం వైఎస్సార్సీ సభ్యులు వి.విజయ సాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ ఈ విషయం తెలిపారు. కోవిడ్-19 వ్యాక్సిన్ తయారీ కోసం దేశంలో ఆరు సంస్థలకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఐ) అనుమతించినట్లు మంత్రి చెప్పారు.అనుమతి పొందిన తయారీదారులలో పూనేకు చెందిన సీరమ్ ఇన్‌స్టిట్యూట్, జెనోవా బయోఫార్మాస్యూటికల్స్, అహ్మదాబాద్‌కు చెందిన కాడిలా హెల్త్‌కేర్, హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్, బయోలాజికల్ ఈ, అరబిందో ఫార్మా, ముంబైకి చెందిన రిలయన్స్ లైఫ్ సైన్సెస్ ఉన్నట్లు తెలిపారు.ఇవి కాకుండా కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మరో 30 వరకు వ్యాక్సిన్ పరిశోధనలకు సాయపడుతున్నట్లు చెప్పారు.కోవిడ్ 19 టెస్టలలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటని మంత్రి వెల్లడించారు. సెప్టెంబర్ 18 నాటికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 10 లక్షల జనాభాకు 85,499 మందికి కోవిడ్ -19 టెస్టులు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. అలాగే కోవిడ్ ఎమర్జెన్సీ రెస్పాన్స్, హెల్త్ సిస్టమ్ ప్యాకేజి కింద రెండు దశలలో ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌కు దాదాపు 200 కోట్ల నిధులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

## రైల్వేకోడూరు ఓసి సంఘం అనుబంధ కమిటీల నియామకం

**రైల్వే కోడూరు, వార్తావళి, సెప్టెంబర్ 21 :** ఓసి సంగం రైల్వేకోడూర నియోజకవర్గ యువజన అధ్యక్షుడుగా యర్రా వెంకటరెడ్డి, ఓసి సంగం ఓబులవారిపల్లె మండల అధ్యక్షుడుగా సయ్యద్ ఇమామ్ బాషా, ఓబులవారిపల్లె మండల రైతు విభాగం అధ్యక్షుడుగా పొగిలి సుబ్బరామిరెడ్డి, ఓబులవారిపల్లె మండల యువజన అధ్యక్షుడుగా ఉమ్మలరాజు సాగర్, ఓబులవారిపల్లె మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడుగా ఆలపాటి నరేంద్రారెడ్డి లను ఓసి సంగం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకట సుబ్బా రెడ్డి చేతులమీదుగా నియామకపత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రమశిక్షణా కమిటీ ఛైర్మెన్ నాగెండ్ల వెంకట సుబ్బా రెడ్డి, బుచ్చయ్య నాయుడు, గడ్డం నారాయణ, రాజోలి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 27న పాలిసెట్ -2020 అర్హత పరీక్ష

**రాజంపేట, వార్తవళి, సెప్టెంబర్ 21:** 2020 -20 విద్యా సం.రానికి ప్రభుత్వ,ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్ష పాలిసెట్ -2020 ఈ నెల 27 న జరుగుతుందని కడప జిల్లా రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వి.ఎన్.శివరామన్ ఒక ప్రకటనలో తెలిపారు.కొత్త బోయన పల్లి లోని అన్నమాచార్య విద్యా సంస్థలకు చెందిన నాలుగు కేంద్రాల్లో 525 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నారని తెలిపారు.ఉదయం 11 నుండి 1 గంట వరకు ఈ పరీక్ష జరుగుతుందని ,విద్యార్థులు 9.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు .11 గంటల తర్వాత వచ్చేవారిని లోపలికి అనుమతించమన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లు ,మాస్కు ,గ్లౌజ్లు తీసుకురావాలన్నారు .సెల్ ఫోన్లు ,డిజిటల్ వాచ్ ,కాలుక్యులేటర్లు అనుమతించబడవన్నారు.



గురజాడ అప్పారావు జయంతి సందర్బంగా పార్వతీపురంలో గురజాడ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని... పాల్గొన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు ధర్మాన కృష్ణ దాస్.. పాముల పుష్ప శ్రీ వాణి, మంత్రి డాక్టర్ అప్పలరాజు.

**- వార్తావళి, పార్వతీపురం**

## ట్రంప్‌కు షాకిచ్చిన రిపబ్లికన్లు

అధికారం శాశ్వితం కాదు. అదెప్పుడో ఒకసారి చేజారేదే. అలాంటప్పుడు అత్యున్నత స్థానంలో ఉన్న వారు ఆచితూచి అన్నట్లుగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఈ




విషయంలో ఏ చిన్న తప్పు దొర్లినా.. తాము చేసిన తప్పును చరిత్ర అదే పనిగా గుర్తు చేస్తూ ఉంటుంది. అమెరికా అధ్యక్ష పదవి లాంటి అత్యున్నత పదవిలో ఉన్న అధినేత తీసుకునే నిర్ణయాలు చాలావరకు ఇప్పటివరకు సాగుతున్న సంప్రదాయాల్ని కొనసాగించేలా ఉండాలి. అందుకు భిన్నంగా ఉండటం ఏ మాత్రం సరికాదు. తానేం అనుకుంటే అది తప్పనిసరిగా జరగాలని బలంగా కోరుకునే ట్రంప్ సంప్రదాయాల్ని.. కొన్ని విధానాల్ని అస్సలు పట్టించుకోరు. అందుకు తగ్గట్లే మూడు రోజుల (శుక్రవారం) క్రితం అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రూత్ బాడర్ గిన్స్ బర్గ్ (87) మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారంలోనే కొత్త న్యాయమూర్తిని నియమిస్తానని ట్రంప్ చేసిన ప్రకటనను పలువురు తప్పు పడుతున్నారు. సాధారణంగా ఎంతటి ఉన్నత పదవిలో ఉన్న వారైనా.. తాము పదవీ విరమణ చేసే సమయం దగ్గరకు వచ్చినప్పుడు కీలక నిర్ణయాల్ని తీసుకోకుండా.. తమ తర్వాత వచ్చే వారు ఎంపిక చేసేలా నిర్ణయాల్ని వదిలేస్తుంటారు. సంప్రదాయమే కాదు.. విధాన పరంగా కూడా ఇదే సరైన పద్ధతి. పదవీ కాలం పూర్తయ్యే వేళలో కీలక నిర్ణయాలు ఎప్పుడు వేలెత్తి చూపించే అవకాశం ఉంటుంది. అందుకే.. అలాంటి వాటి జోలికి వెళ్లకుండా జాగ్రత్త పడుతుంటారు. అందుకు భిన్నంగా ట్రంప్ మాత్రం సుప్రీంకోర్టు న్యాయమూర్తిని ఎంపిక చేస్తామన్న ప్రకటన చేయాలన్న పట్టుదలతో ఉన్నారు. ఆయన నిర్ణయాన్ని సహజంగానే డ్రెమెక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అంతేకాదు.. అధ్యక్ష ఎన్నికల బరిలో డెమొక్రాట్ల అభ్యర్థిగా నిలిచిన బైడెన్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టుకు నామినేట్ చేసే ఏ అభ్యర్థికి ఓటు వేయకూడదని రిపబ్లికన్లను కోరారు. అంతేకాదు.. కొత్త అధ్యక్షుడిగా ఎన్నికయ్యే వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. తాను కానీ అధ్యక్షుడిగా ఎన్నికైతే.. ఆఫ్రికన్ - అమెరికన్ మహిళను సుప్రీంకోర్టుకు నామినేట్ చేస్తానని చేసిన ప్రకటన పలువురిని ఆకర్షిస్తోంది. ఇదిలా ఉంటే.. వంద సీట్ల చాంబర్ లో ఇప్పటికే ట్రంప్ ప్రతిపాదనను 53 మంది రిపబ్లికన్లు వ్యతిరేకించారు. అంతేకాదు.. 62 శాతం మంది అమెరికన్లు కొత్త అధ్యక్షుడే సుప్రీం న్యాయమూర్తిని నియమించాలని భావిస్తున్నట్లుగా రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. ఊహించని రీతిలో రిపబ్లికన్ల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకత ట్రంప్ కు షాకింగ్ గా మారింది. ఈ నేపథ్యంలో ఆయన ఎలా వ్యవహరిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## అగ్రవర్ణ పేదలను ఆదుకోవాలి : ఓ.సి సంఘం



**రైల్వే కోడూరు, వార్తావళి, సెప్టెంబర్ 21 :** ఓ.సి సంగం నియోజకవర్గ స్థాయి సమావేశం ఓబులవారిపల్లె మండలం కాపుపల్లె గ్రామంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా ఓ.సి సంగం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకట సుబ్బా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ.సి సంగం నాయకుడు కందనూరు వెంకట సుబ్బా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు అగ్రవర్ణపేదలను కేవలం ఓట్ల సమయంలో ఉపయోగించుకుని ఓ.సి సమస్యల పరిష్కారానికి ఒక్క పార్టీ, ఒక్క రాజకీయ నాయకుడు కూడా ముందుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అగ్రవర్ణ పేదలు చాలా ప్రమాదంలో ఉన్నారని, అగ్రవర్ణ పేదల సమస్యల పరిస్కారం కొరకు ఓ.సీలు అందరూ ఏకతాటి పైకి వచ్చి ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్.సి/ ఎస్ .టి లకు కల్పించినట్లే "విదేశీవిద్యానిధి" పథకాన్ని నిరుపేద ఓ .సి లకు కూడా కల్పించాలని, దేశవ్యాప్తంగా దుర్వినియోగం అవుతున్న ఎస్.సి/ ఎస్.టి అట్రాసిటీ యాక్ట్ పూర్తిగా రద్దు చెయ్యాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసాడు.

## ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడుగా రవికుమార్‌రెడ్డి



**ప్రొద్దుటూరు, వార్తావళి, సెప్టెంబర్ 21 :** ఓసి సంగం ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడుగా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఎమ్.టి.రవికుమార్ రెడ్డిని ఓసి సంగం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకట సుబ్బా రెడ్డి నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఓసి సంగం సంగం కార్యాలయం నందు జరిగిన సమావేశంలో కందనూరు వెంకట సుబ్బా రెడ్డి మాట్లాడుతూ నిరుపేద ఓసి అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు వయోపరిమితి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.ప్రతి మండలంలో ఓసి విద్యార్థులకు సంక్షేమ హాస్టళ్ళు ఏర్పాటు చెయ్యాలని, భూమి కొనుగోలు పథకం ఓసిలకు కూడా అమలు చెయ్యాలని, ఓసి కౌలు రైతులకు కూడా రైతు భరోసా కల్పించి నిరుపేద ఓసీలను ఆదుకోవాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో క్రమశిక్షణా కమిటీ ఛైర్మెన్ నాగేండ్ల వెంకట సుబ్బా రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఎల్ వి సుబ్బారెడ్డి, ప్రచారకార్యదర్శి బాసిరెడ్డి హేమకుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రవీంద్రారెడ్డి, యువజన కార్యదర్శి రాజోలి రాజారెడ్డి, యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నపుల చంద్ర శేఖర్ రెడ్డి, ఐ.టి. విభాగం అధ్యక్షుడు హరినాధ రెడ్డి బుచ్చయ్య నాయుడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్య ప్రాజెక్ట్ రెండు గేట్ల ద్వారా 2984 క్యుసెక్కుల నీరు విడుదల



**రాజంపేట, వార్తవళి, సెప్టెంబర్ 21:** కడప జిల్లా రాజంపేట అన్నమయ్య ప్రాజెక్ట్ రెండు గేట్ల ద్వారా 2860 కుసెక్కుల నీటిని చెయ్యేరు నదిలోకి విడుదల చేశారు.సోమవారం సాయంత్రానికి చెయ్యేరు నది అంతా ప్రవాహం విస్తరించే అవకాశం ఉంది.విడుదలైన వరద నీరు రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల్లో చెయ్యేరు నది గుండా ప్రవహిస్తుంది.ఈ వరద వల్ల భూగర్భ జలాలు పెరిగి సాగు,తాగు నీటి నిల్వలు పెరుగుతాయని ,ఈ నదీ పరివాహక ప్రాంతంలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..అన్నమయ్య ప్రాజెక్ట్ కాలువ నుండి చెరువులకు 120 కుసెక్కులు,తాగునీటి కొరకు 4 కుసెక్కులు,రెండు గేట్ల ద్వారా చెయ్యేరు నదిలోకి 2860 కుసెక్కులు నీరు విడుదల జరుగుతోందని అన్నమయ్య ప్రాజెక్ట్ సబ్ డివిజన్-4 ఏ.ఈ బి.నాగేంద్ర నాయక్ తెలిపారు. ఇన్ ఫ్లో 2128 ,అవుట్ ఫ్లో 2984 కుసెక్కులుగా ఉందన్నారు.

## గోదావరి జిల్లాల్లో దొరుకుతున్న పులస చేప... కిలో రూ.10 వేలే



ఉభయ గోదావరి జిల్లాలో స్వచ్ఛమైన గోదావరిలో దొరికే పులస చేప అంటే.. ఎంతో క్రేజ్! ముఖ్యంగా ధవళేశ్వరం వద్ద ఇవి దొరుకుతాయి. వీటిని కొనడం కోసం వ్యాపారులు, కొనుగోలుదారులు పడిగాపులు కాస్తారు. చూపుకు చిన్నదే అయినా బరువులో మాత్రం తక్కువేం కాదు. చిన్నగా కనిపించే చేప కూడా తక్కువలో తక్కువగా కెజి తూకుతుంది. రేటు ఇంతకుముందు కిలో 2, 3 వేల రూపాయలుండేది. ఇప్పుడు ఏకంగా రూ.10 వేలు దాటేస్తోంది. పులస దొరుకుతున్నదాని బట్టి రేటు మారిపోతుంటుంది. ప్రస్తుతం రూ.7 వేల నుండి రూ.10 వేల వరకు పులస రేటు పలుకుతోంది. ఈ పులస చేప ఆదివారం వైనతేయ గోదావరి నదిలో పాశర్లపూడికి చెందిన మత్స్యకారుల వలకు చిక్కింది. భారీ డిమాండు ఉన్న ఈ పులస రెండున్నర కిలోల బరువు తూగింది. కొనుగోలుదారుల హడావిడి పెరిగింది. పాశర్లపూడి గ్రామానికి చెందిన వైసిపి నేత, నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొమ్ముల కొండలరావు రూ.21 వేలు చెల్లించి ఈ బంగారు చేపను చేజిక్కించుకున్నారు.

## లక్షణాలు లేకున్నా.. మస్తుగా వైరస్ లోడ్



కరోనా నేపథ్యంలో పలు సంస్థలు పలు విధాలుగా పరిశోధనలు చేస్తున్నాయి. తాజాగా అలాంటి సర్వే ఒకటి బయటకు రావటమే కాదు.. గుండెలు అదిరే విషయాల్ని వెల్లడించింది. హైదరాబాద్ కు చెందిన సెంటర్ ఫర్ డీఎన్ ఏ ఫింగర్ ప్రింట్స్ ఒక సర్వేతో పాటు.. అధ్యయనాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇప్పటివరకు 57వేల మంది వైరస్ బారిన పడితే.. అందులో 70 శాతం మందికి ఎలాంటి లక్షణాలు కనిపించలేదని.. కేవలం 30 శాతం మందిలోనే జ్వరం.. దగ్గు.. జలుబు లాంటి లక్షణాలు కనిపించినట్లుగా తేల్చారు. షాకింగ్ నిజం ఏమంటే.. కోవిడ్ లక్షణాలు ఉన్న వారితో పోలిస్తే.. ఎలాంటి వైరస్ లక్షణాలు లేని వారిలో వైరస్ లోడ్ భారీగా ఉన్న విషయాన్ని గుర్తించినట్లు వెల్లడించారు. రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండటం వల్ల వైరస్ లోడ్ ఉన్నప్పటికీ.. ఆ విషయం బయటకు రాలేదన్న విషయాన్ని గుర్తించారు.వీరి కారణంగానే పెద్ద వయస్కులు.. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు.. పిల్లలకు వైరస్ వ్యాప్తి చెందుతోందని.. పరోక్షంగా పలువురి మరణాలకు కారణమవుతున్నట్లుగా తేల్చారు. ఈ సంస్థ చేసిన పరిశోధన వివరాల్ని బయో ఆరెక్సీవ్ లో ఇటీవల పబ్లిష్ అయ్యాయి. గ్రేటర్ పరిధిలోని వైరస్ బారిన పడిన వారిలో అత్యధికులు 20బిక్లేడ్ అనే స్ట్రెయిన్ కు చెందిన వైరస్ ఉన్నట్లుగా తేల్చారు.అతి తక్కువ మందిలోనే ఇతర స్ట్రెయిన్ లకు చెందిన వైరస్ లు ఉన్నట్లుగా తేల్చారు. కేసుల నమోదైన తొలినాళ్లలో రెండు మూడు రకాల వైరస్ లు నిర్ధారణ కాగా.. మే.. జూన్ లలో మాత్రం బిక్లేడ్ స్ట్రెయిన్లతో కూడిన కేసులు నమోదైనట్లుగా తేల్చారు. ఇదంతా చూస్తే.. ఇప్పటివరకూ వైరస్ బారిన పడని వారిలో చాలామందిలో వైరస్ లోడ్ ఉండదన్న విషయం ఆందోళనకు గురి చేయటం ఖాయమని చెప్పక తప్పదు.



# విశాఖ రూరల్ వార్తలు

## రోడ్డు పరిస్థితి ఇలా.. మరి నడిచేదెలా !



**మాడుగుల, వార్తవళి సెప్టెంబరు 21 :** స్థానిక మోదమాంబ కాలనీకి వెళ్ళే దారితో పాటు సాగరం కాలనీకి వెళ్ళే మట్టి రోడ్డు కురిసిన వర్షాలకు అస్థవ్యస్థంగా తయారయ్యింది. అయితే మోదమాంబ కాలనీలో సుమారు 15 వందల మందికి పైగా జనాభ ఉంటారు. నిత్యం కాలనీ నుంచి బస్టాండ్‌కి రావాలన్న, ఇదే మార్గం కావడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పాత హాస్టల్ దగ్గర గోతులు మయంగ మారి నడవడానికి కూడా వీలులేని విధంగా మారింది. దీంతో పాదచారులు, వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకొని క్రస్సర్ బుగ్గి వేయించి తాత్కాలిక మరామత్తులు చేయిస్తే మంచిదని కాలనీ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా దేవి ఆడిటోరియం నుంచి సాగరం వెళ్ళే రోడ్డు కూడా పూర్తిస్థాయిలో నిర్మాణం చేపడితే అన్ని విధాలుగా బాగుంటుందని అటుగా రాకపోకలు సాగించే ప్రజలు, ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు. గత టీడీపీ హయాంలో కూడా ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి పలుమార్లు నాయకులను కలసి విన్నవించిన ఇదిగో అదిగో అంటూ కాలం వెళ్ళదీసిన పరిస్థితులు ఉన్నాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అధికారంలో వైసీపీ ప్రభుత్వం ఉండటంతో పాటు అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిసారిస్తున్న ఎమ్మెల్యే ఈ రోడ్డు నిర్మాణం కూడా చేపడతారనే విధంగా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఏళ్ళ కాలంగా నెరవేరని మోదమాంబ కాలనీలో డ్రైనేజీలపై ఎమ్మెల్యే ముత్యాలనాయుడు ప్రత్యేక దృష్టిసారించి నిర్మాణం పనులు పూర్తి చేశారని అదే మాదిరిగా రోడ్డు, తాచేరు ఏరుపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## చిరువ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి

### బిఎస్‌పి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ సూదికొండ మాణిక్యాలరావు



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 21 :** రోడ్డు ప్రక్కన తోపుడు బండ్ల మీద అలాగే రోడ్డు మీద చిన్న చిన్న వ్యాపారం చేసుకుని బ్రతికే చిరు వ్యాపారులను ప్రభుత్వం మానవతా దృక్పధం తో ఆర్థికంగా అదుకోవాలని మాణిక్యాల రావు విజ్ఞప్తి చేసారు పట్టణం లో పలు చోట్ల రోడ్డు ప్రక్కన వ్యాపారం చేసుకునే చిరువ్యాపారులను కలసి వారి ఇబ్బందులు ను అడిగి తెలుసుకున్నారు కరోనా కారణంగా గత కొన్ని నెలలు గా వ్యాపారములు పూర్తిగా మందగించి ఆర్థికంగా త్రివ ఇబ్బందులు ఎదురుకుంటున్నమని వ్యాపార పెట్టుబడి కోసం తెచ్చిన రుణములు వడ్డీలు చెల్లించలేక అవమానాలు పడుతున్నమని వారు ఆవేదన వ్యక్తం చేశారు రోజంతా కష్టపడినా కనీసం కూలి డబ్బులు కూడా రావడం లేదని చాలి చాలని సంపాదన తో కుటుంబములుతో అర్ధాకలి తో జీవిస్తున్నమన్నారు మాణిక్యాలరావు మాట్లాడుతు చిరువ్యాపారులను ప్రభుత్వం ఆర్థికంగా అదుకోవాలన్నారు వారికి వడ్డీ లేని ఋణం మంజూరు చేసి అదుకోవాలన్నారు చిరువ్యాపారుల చట్టం 2014 ను సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వం ను కోరారు చిరువ్యాపారులందరు సమస్యల పరిష్కారం కోసం ఐక్యమత్యంగా పోరాడాలన్నారు చిరు వ్యాపారులు సమస్యలు ను ప్రభుత్వం ద్రుష్టి కి తీసుకోని వెళ్లి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

## అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలు



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 21 :** ఉత్తరాంధ్ర నాగార్జున ఫ్యాన్స్ అధ్యక్షులు మళ్ళ సురేంద్ర ఇంటి దగ్గర దాదా ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు 97వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ముందుగా అక్కినేని అభిమానుల సమక్షంలో అక్కినేని చిత్రపటానికి పూజ కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం ముఖ్యఅతిథిలుగా ప్రముఖ సినీ ఎగ్జిబిటర్ మళ్ళ నర్సింగ్ రావు, గౌరీ సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు , అక్కినేని నాగేశ్వర్ రావు జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ అక్కినేని జీవితం ఎందరికో ఆదర్శం అన్నారు.ఈ కార్యక్రమంలో బుద్ధ అప్పారావు మాస్టర్, ఆడారి కాశీ రావు, సన వెంకట్రావు, మద్దాల వీరు నాయుడు, సిహెచ్ అవతారం (అవ్వ), మళ్ళ ఈశ్వర్ రావు , నెహ్రూ మాస్టర్, దొడ్డి రమేష్, గోల్డ్ వాసు, నీలగి శ్రీను, పొలిమేర ఆనంద్, మోనో శ్రీను, జొన్నాడ సురేష్, ఎస్, భాను చందర్ అఖి, గణేష్, విశ్వనాథ్, చందు మరియు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు 25 లక్షల ఇల్లును నిర్మించి ఇస్తామన్న వాగ్దానం ఒక్క అడుగు కూడా పడలేదు

### ఎంఎల్‌సి బుద్ధ నాగ జగదీశ్వరరావు



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 21 :** రాష్ట్రములో పేదలకు 25 లక్షల ఇల్లును నిర్మించి ఇస్తామని మీరు చేసిన ఎన్నికల వాగ్దానం పై ఈ 15 నెలల కాలంలో ఒక్క అడుగు కూడా పడలేదని శాసనమండలి సభ్యులు శ్రీ బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటన కూడా కార్యరూపం దాల్చలేదు పైగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సర్కారు ప్రయత్నాలకు తెలుగుదేశం పార్టీ అడ్డు పడుతుందని గ్లోబల్ ప్రచారాలు చేస్తున్నారు తెలుగుదేశం ప్రభుత్వహయాంలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా పెద్ద సంఖ్యలో ఇల్లును మంజూరు చేయించుకోవడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో ఎన్టీఆర్ గృహ నిర్మాణం పథకం కింద 10 లక్షల మంది పేదలకు పక్కా ఇళ్లను మంజూరు చేసిందని 2014 కు ముందు కాంగ్రెస్ హయాంలో మంజూరై వివిధ కారణాల వల్ల అర్థాంతరంగా ఆగిపోయిన 4, 40, 426 గృహాలకు అదనముగా 25 నుంచి 50 వేల రూపాయల దాకా అధిక సహాయం అందించి వాటిని పూర్తి చేసుకోవాలని లబ్ధిదారుని ప్రోత్సహించమని 2019 మార్చి నాటికి వాటిలో 2, 17, 375 ఇ ళ్లను పేదలు నిర్మించుకో గలిగారని నాగ జగదీశ్ తెలిపారు తెలుగుదేశం ప్రభుత్వం ఇల్లు పథకాన్ని తామెందుకు కొనసాగించాలని చంద్రబాబు ప్రభుత్వం అనుకోలేదని అందువల్లే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద మంజూరైన మొత్తం 20, 96, 331 ఇల్లు నిర్మాణ పనులను ఆంధ్ర ప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ చేపట్టింది 2019 ఫిబ్రవరి నాటికి 7, 76, 456 గృహాలను పూర్తి చేశారు ఇవి కాకుండా నగరాల్లో పట్టణాల్లో బహుళ అంతస్తుల భవనాలు రూపములో 5.46 లక్షల మందికి పేద మధ్య తరగతి వారి కోసం ఏపీ టిడ్కో ద్వారా గృహాల నిర్మాణం చేపట్టారు వీటిలో కూడా సగానికి పైగా ఇల్లు పూర్తి చేశారని నాగ జగదీష్ తెలిపారు ఒక విశాఖ జిల్లాలోనే అనకాపల్లి గాజువాక భీమిలి పెందుర్తి తూర్పు ఉత్తర పశ్చిమ నర్సీపట్నం ఎలమంచిలి నియోజకవర్గాల్లో పూర్తిచేసిన టిడ్కో గృహాలు 28056 పూర్తి చేసి ఉన్నప్పటికీ లబ్ధిదారులకు అంద చేయకుండా తెలుగుదేశం పార్టీ అడ్డుకుంటుందని అబద్ధపు ప్రచారాలు చేయడం దుర్మార్గమని వెంటనే లబ్ధిదారులకు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని నాగ జగదీష్ డిమాండ్ చేశారు.

## వ్యవసాయ బిల్లుపై నిరసన



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 21 :** నిన్న రాజ్యసభలో ఆమ్మోదించిన రైతు వ్యతిరేక చట్టాలకు నిరసనగ అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్ డి ఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగ అనకాపల్లి అసెంబ్లీ నియ్యోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ ఐ.ఆర్.గంగాధర్ మాట్లాడుత్తు దేశంలో రైతాంగాన్ని తీవ్రంగ నష్టపరిచే చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేసారు.కేంద్ర బిజెపి ప్రభుత్వం పథకం ప్రకారం దేశంలో గల వనరులను అన్నీ పెట్టబడిదార్ల కి దోచిపెడుతున్నారని విమర్శించారు.దేశానికి వెన్నుముక అయిన రైతుల ప్రయ్యొజనాలను కార్పొరేట్ శక్తులకు అప్పగించటానికే కొత్త చట్టాలను తీసుకు వచ్చారని అన్నారు.ఇటువంటి నియంతృత్వ వైఖరితో చేసిన చట్టాలను వ్యతిరేకించ వలసిన వై సి పి, టి డి పి లు ,నేడు కేంద్ర బిజెపి విధానాలకు మద్దత్తు ఇస్తు రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని దుయ్యబట్టారు.ఈ నిరసన కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి తుట్టా రమణ,జిల్లా యుత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి సంతోష్,జిల్లా కాంగ్రెస్ బి.సి.సెల్ నాయకుడు గౌరీపట్నపు గున్నబాబు,పట్టణ కాంగ్రెస్ నాయకులు ఇల్లా కనకదుర్గా రావు,పిల్లి నానీ,యుత్ కాంగ్రెస్ నాయకుడు యల్లపు ర్షుపేష్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా రెండోరోజు సచివాలయ పరీక్షలు



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 21 :** గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఖాళీ పోస్టుల భర్తీకి సోమవారం నిర్వహించిన రెండోరోజు పరీక్షలు కూడా ప్రశాంతంగా జరిగాయి. విజయనగరంలోని 19 పరీక్షా కేంద్రాల్లో ఉదయం పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 5,756 మంది హాజరు కావాల్సి ఉండగా, 3,714 మంది హాజరయ్యారు. 2042 మంది పరీక్షకు గైర్హాజరు కావడంతో, హాజరు శాతం 64.52గా నమోదయ్యింది. మధ్యాహ్నం 9 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 2,995 మంది హాజరు కావాల్సి ఉండగా, 2,041 మంది హాజరయ్యారు. 954 మంది గైర్హాజరు అవ్వడంతో, హాజరు శాతం 68.15గా నమోదయ్యింది. విజయనగరం ఎంఆర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్ తనిఖీ చేశారు. సెయింట్ జెసెఫ్ పాఠశాల, ఎజిఎల్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను డిఆర్‌డిఏ పిడి కె.సుబ్బారావు తనిఖీ చేశారు.

## బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### గల్లా రాజును అభినందించిన అధ్యక్షులు సత్యనారాయణ



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 21 :** బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. యువ మోర్చా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గల్లా రాజు నేతృత్వంలో మాధవ సదన్ లో జరిగిన కార్యక్రమంలో యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాని జిల్లా అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదిన సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సప్తాహలో భాగంగా చేపట్టిన రక్తదాన శిబిరానికి స్పందన రావడం హర్షణీయమన్నారు. గత వారం రోజులుగా బిజెపి నాయకులు పలు ప్రాంతాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తు చేశారు. ప్రజల్లో సేవా కార్యక్ర మాలతో నిలవాలని ఉద్దేశంతోనే ఈ సేవా సప్తాహ అన్నారు. రక్తదాన శిబిరం విజయవంతం చేయడంలో డాక్టర్ రాజు కృషిని కొనియాడారు. దేశ పురోభివృద్ధిలో మోడీ తనదైన ముద్ర వేసిన నేపథ్యంలో రానున్న కాలంలో ఆంధ్రప్రదేశ్ లో బిజెపియే అధికారంలోకి రానుందన్నారు. ఇప్పటికే అనేక మంది నాయకులు బిజెపి వైపు చూస్తున్నారనారు. విశాఖ ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో బ్లడ్ బ్యాంక్ కొనసాగింది. రక్తాన్ని స్వచ్ఛందంగా ఇచ్చేందుకు పలు ప్రాంతాల నుంచి బిజెపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం వైద్యుల ను బిజెపి నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ద్వారపూడి పరమేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పి వి ఎస్ వర్మ, ఎస్సీ సెల్ కార్యదర్శి కొండబాబు మాస్టారు, సీనియర్ నాయకులు జనార్ధన్, పట్టణ అధ్యక్షులు కర్రి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, వుడా రమేష్, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సాయిరాం, యడ్ల త్రినాధ రావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ తిరుమల పర్యటన ఖరారు



**తిరుమల, వార్తావళి, సెప్టెంబర్ 21 :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 23న విజయవాడ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి సాయంత్రం 3.50 గంటలకు సీఎం జగన్ చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా సాయంత్రం 5 గంటలకు తిరుమలలోని పద్మావతి గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. సాయంత్రం గం. 6.20 నిమిషాలకు గరుడ వాహనం సందర్భంగా శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. 24న ఉదయం గం. 8.10 నిమిషాలకు కర్ణాటక ముఖ్యమంత్రి యాడ్యూరప్పతో కలిసి కర్ణాటక సత్రాల నూతన భవన నిర్మాణ భూమి పూజలో వైఎస్ జగన్ పాల్గొంటారు. అదే రోజు మధ్యాహ్నం గం.11.30 కు తిరుమల నుండి తిరుగు ప్రయాణం అవుతారు.

## శ్రీ వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి, ఆగిరిపల్లి

**స్థలపురాణం:**

ఈ ఆలయం 4000 సంవత్సరాల చరిత్ర గల్గిన అత్యంత ప్రాచీనమైన ఆలయంగాగా బ్రహ్మాండ పురాణం చెబుతోంది. స్వామి వెలసిన ఈ శోభనాద్రి కృతయుగంలో "కళ్యాణాద్రి"యని, త్రేతాయుగంలో "శోభాచల" మని, ద్వాపరయుగంలో "స్వప్న శైల" మని, కలియుగంలో "శోభనాద్రి" అని పిలువ బడు తున్నట్లు స్థలపురాణం చెపుతోంది. శుభవ్రతుడనే మహారాజు సనత్కుమారుని వలన నారసింహ మంత్రాన్ని పొంది, రాజ్యాన్ని కుమారుల కప్పగించి, తపస్సు చేసుకోవడానికి బయలుదేరాడు. ప్రశాంత ప్రదేశం కోసం వెతుకుతూ వస్తున్న ఆ రాజుకు దట్టమైన అడవి, ఫలవృక్షాలతో కూడిన ఈ ప్రాంతానికి వచ్చేసరికి ఏదో తెలియని ఆనందం, మానసిక ప్రశాంతత లభించడంతో, తన తపస్సుకు ఇదే సరైన ప్రదేశంగా నిర్ణయించుకొని, శ్రీ మహా విష్ణువుని గూర్చి దీర్ఘకాలం తపస్సు చేసి స్వామిని సాక్షాత్కరింప చేసుకున్నాడు.

**రాజ్యలక్ష్మీ సమేత వ్యాఘ్ర నరసింహస్వామి**

ప్రత్యక్షమైన శ్రీహరిని శుభవ్రతుడు నీ యిల్లాలైన రాజ్యలక్ష్మీ దేవితో కూడి నీవు ఈ కొండపై కొలువు తీరవలసిందని, నిత్యము నిన్ను దర్శించే భాగ్యాన్ని తనకు కలిగించ వలసిందని ప్రార్థించాడు. భక్తుని కోరికను మన్నించిన శ్రీ మన్నారాయణుడు వ్యాఘ్ర ముఖుడై లక్ష్మీసమేతంగా కొలువు తీరాడు. కొండ మీద స్వయంభువు ఐన స్వామి వ్యాఘ్రరూపుడుగానే దర్శనమిస్తాడు. కొండ క్రింద ఆలయం లో లక్ష్మీ సమేతంగా కొలువు తీరి ఉంటాడు. క్షేత్రపాలకుడు గా పర్వత శిఖరాగ్రం పై మల్లేశ్వరస్వామి పూజ లందుకొంటున్నాడు.

**మరొక కథ ననుసరించి....**

శివ కేశవు లిరువురు సాయంకాలపు వాహ్యాళికి బయ లుదేరారు. ఈ ప్రదేశానికి వచ్చేసరికి సంధ్యాసమ యం అవ్వడంతో సాయం సంధ్యావందనానికి అనువైన తావును చూడవలసింది గా విష్ణువు శంకరుణ్ణి కోరాడు. శంకరుడు వెతుకుతూ కొండ పై భాగానికి వెళ్లి, ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడై అక్కడే ఉండి పోయాడు. ఎంతసేపయినా శివుడు రాక పోవడం తో వెతుకుతూ వెళ్లిన విష్ణువు ప్రశాంతంగా కూర్చున్న శివుని చూచి కోపంగా అక్కణ్ణుంచి రెండడుగులు క్రిందకు దూకి, అక్కడ వెలిశాడని, అందుకు సాక్ష్యంగా ఇప్పటికి కూడ శివాలయం వద్ద విష్ణువు పాదముద్ర లున్నా యని, అచ్చటి రాతి పై నున్న పాదచిహ్నాలను చూపిస్తున్నారు. ఈ కథ భక్తజనం లో బాగా ప్రచారం లో ఉంది.

కొండమీదకు మెట్లమార్గం

**ఆలయప్రత్యేకత.:**

ఈ ఆలయానికి అత్యంత అరుదుగా కన్పించే పొడ వాటి, వెడల్పయిన 750 మెట్లు కొండపై నున్న మూ లవిరాట్టు వరకు ఉండాయి. ఎన్నో వందలసంవత్సరాలు గా చెక్కు చెదరని వాటి నిర్మాణ పటిమకు జోహార్లు చెప్పక తప్పదు. క్రీ.శ 1561 లో పుష్కరిణి మెట్లను, కొండపైకి మెట్లను నిర్మించారని కొందరు వ్రాశారు కాని సాక్ష్యాలు లభించడం లేదు. ఇక్కడ అర్చక స్వాములు ప్రతిరోజు ఉదయం, సా యంత్రం 750 మెట్లు ఎక్కి పూజ, నివేదనలు చేసి వస్తారు. ప్రతిరోజు స్వామివారి నివేదన లో వ్యంజ నంగా ఎండు మిరపకాయలు తిరగమోతలో వేసిన చింతపండు, బండ పచ్చడి తప్పనిసరిగా ఉండాలి. చక్రపొంగలి, పులిహోర భోగాలు ఉంటూనే ఉంటాయి



**వరాహ పుష్కరిణి:**

దీనినే కృతయుగంలో అనంత సరస్సు అనే వారట... కుజదోషం ఉన్నవారు, వివాహం ఆలస్యమౌతున్న వాళ్లు స్వామి వారి కళ్యాణం చేయిస్తే వివాహ మౌతుందని భక్తుల నమ్మకం. ఊరికి నాలుగు వైపుల కళ్యాణ మండపాలు ఉండటం ఈ క్షేత్రం ప్రత్యేకత. ఊరి మధ్యలో కొఠాయి అనే పేరుతో పెద్ద కళ్యాణ మండపం ఉంది. స్వామి వారి కళ్యాణోత్సవాలు ఇక్కడే జరుగుతాయి.


**ఎలా చేరుకోవాలి???**

విజయవాడ నుండి నూజివీడు వెళ్లే మార్గంలో విజయవాడకు 25 కి.మీ దూరంలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. విజయవాడ నుండి వయా ఆగిరిపల్లి మీదుగా ఆర్టీసీ బస్సులు చాలా ఉన్నాయి.

## స్పందనలో సమస్యల పరిష్కారం

**నర్సీపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 21 :** స్పందనలో వచ్చిన వినతులను పరిశీలించి సమస్యల సత్వర పరిష్కారం చేయడం జరుగుతుందని సబ్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య తెలిపారు. సోమవారం స్పందనలో భాగంగా 32 దరఖాస్తులు వచ్చాయి. భూ సంబంధిత సమస్యలు,రేషన్ కార్డ్ లు, పింఛన్లు తదితరాలపై వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం కోవిడ్ విస్తృతంగా ప్రబలుతున్న నేపథ్యంలో అధికారులు తగు జాగ్రత్తలు తీసుకొని ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, నిర్ణీత కాల వ్యవధిలో సమస్యలను పరిష్కారం చేయాల్సిందిగా ఆదేశించడం జరిగిందన్నారు.సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతులను స్వీకరించేందుకు ప్రత్యేక ఫిర్యాదుల బాక్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ప్రజలు తమ దరఖాస్తులను ఫిర్యాదుల బాక్స్‌లో వేయాలని, వాటన్నిటినీ పరిశీలించి నిర్దేశిత సమయంలో పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు.

## టీవీల ధరలు పెరగక తప్పదా?



ఎల్ఈడీ టీవీల తయారీ కోసం వినియోగించే ఓపెన్‌సెల్‌పై అక్టోబరు 1 నుంచి కస్టమ్స్ సుంకం 5 శాతం అమలు కానుంది. 2017 డిసెంబరు నుంచి టీవీ విడిభాగాలపై 20 శాతం కస్టమ్స్ సుంకం అమలవుతోంది. అయితే ఓపెన్‌సెల్ తయారీ దేశీయంగా చేపట్టేవరకు, దిగుమతికి అంగీకరించాలని పరిశ్రమ అభ్యర్థించడంతో, 2020 సెప్టెంబరు 30 వరకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. గడువు ముగుస్తున్నందున, అక్టోబరు 1 నుంచి ఓపెన్‌సెల్‌పైనా గతంలో ప్రకటించినట్లు 5 శాతం కస్టమ్స్ సుంకం అమలవుతుందని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. సుంకం విధించకపోతే, విడిభాగాలు తయారు చేయకుండా, దిగుమతి చేసుకుని, టీవీల అసెంబ్లింగ్ మాత్రమే దేశీయంగా చేస్తున్నారని పేర్కొన్నాయి. పూర్తిగా తయారుచేసిన ప్యానెల్ ధర ఇప్పటికే 50 శాతం పెరిగిందని, ఓపెన్‌సెల్‌పై 5 శాతం కస్టమ్స్ విధిస్తే, టీవీ ధర 4 శాతం వరకు పెంచాల్సి వస్తుందని టీవీ తయారీ సంస్థలు పేర్కొంటున్నాయి. 32–42 అంగుళాల టీవీల ధరలు రూ.600–1500 వరకు పెరుగుతాయని, పెద్ద స్క్రీన్ టీవీల ధరలు మరింత పెరుగుతాయని పేర్కొంటున్నాయి. అయితే ఓపెన్ సెల్‌ను ప్రముఖబ్రాండెడ్ సంస్థలే రూ.2700–4500 చొప్పున దిగుమతి చేసుకుంటున్నాయని, 5 శాతం కస్టమ్స్ సుంకం వల్ల పడే భారం రూ.150–250 మాత్రమేనని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఏడాదికి రూ.7500 కోట్ల విలువైన విడిభాగాలను టీవీ పరిశ్రమ దిగుమతి చేసుకుంటోందని, వీటిని దేశీయంగా తయారు చేయించడమే లక్ష్యమని వివరిస్తున్నాయి. కస్టమ్స్ సుంకం వల్ల దేశీయ తయారీ పరిశ్రమలకు ఊతం లభిస్తుందన్నారు.



# విశాఖపట్నం వార్తలు

## గాజువాకలో విషాదం



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 21:** విశాఖ గాజువాకలో విషాదం చోటుచేసుకుంది ఉదయం 6 -30 సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అత్మహత్య చేసుకు న్నారని స్థానికులు ఇచ్చిన సమాచారం పోలీసులకు అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరు కొని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా లేదా ఎవరైన డీసిల్ పోసి తగులుపెట్టారా అన్న కోణం లో కేసు విచారణ చేపట్టారు. అయితే ఈ ఉదయం 6:30 సమయంలో ఇతను ఇలా ఆత్మహత్య చేసుకున్నాడు ఎందుకు చేసుకుంటారు. అన్న కోణంలో కూడా పోలీసులు విచారిస్తున్నారు అయితే ఇక్కడ ఈ సంఘటన స్థలం చుట్టు పక్కన స్క్రాప్ షాప్‌లూ ఉండటం లారి పార్కింగ్ ఉండడం అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, దీనిపై పోలీసులు దృష్టి చారించాలని స్తానికులు కోరుతున్నారు.

## ఆధునిక సమాజ సృష్టికర్త గురజాడ ఘనంగా జయంతి వేడుకలు



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 21:** భాషను ప్రజల కొరకు అంకితం చేసిన మహనీయుడు.. సంస్కరణా పథాన్ని ఎన్నుకొని పరిష్కరించిన మానసీయుడు.. వ్యవహారిక భాషోద్యమానికి అంకురార్పణ చేసిన వ్యవహార దక్షుడు గురజాడ అప్పారావు అందించిన సేవలు చిరస్మరణీయం అని జాతీయ జర్నలిస్ట్ ల సంఘం కార్యదర్శి .. వైజాగ్ జర్నలిస్ట్ ల ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు కొనియాడారు. సోమవారం గురజాడ జయంతి వేడుకలును ఇక్కడ ఉడా గురజాడ కళాక్షేత్రము వద్ద ఘనంగా నిర్వహించారు. తొలుత గురజాడ విగ్రహంకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీనుబాబు మాట్లాడుతూ మూఢా చారాల ముసుగులో జరిగే అమానుషాన్ని ఖండించడంతో పాటు తెలుగు కవితాకన్యకకు ముత్యాల సరాల నలంకరించిన ధన్యజీవి అని ప్రశంసించారు ..ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంత్ కుమార్ మాట్లాడుతూ తెలుగు కథావనంలో తొలి కథా దిద్దుబాట్లు వెలయించిన ఆధునిక తెలుగు కథా సృష్టికర్త గురజాడ మాత్రమేనన్నారు. వట్టి మాటలు ..కట్టిపెట్టి ..గట్టి మేలు తలపెట్టవోయ్ ... దేశమంటే మట్టి కాదు ..దేశం అంటే మనుషులోయ్ అని గొప్ప జీవిత సత్యాలని జాతికి చాటి చెప్పారన్నారు ..ఈ కార్యక్రమం లో ఏయూ విద్యార్థి నాయకులు విఎన్ మూర్తి ..ఏపి నిరుద్యోగ .జేఏసీ విశాఖ జిల్లా అధ్యక్షులు సనపల తిరుపతి రావు ..శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ఎం ..సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..** రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, శ్రీగాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ప్రకృతి చికిత్సా లయం మహారాణి పేట నిర్వహణలో మహాకవి గురజాడ అప్పారావు గారి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ ముందుగా మహాకవి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ మహాకవి విశాఖ వాసి అవ్వటం మనకెంతో గర్వకారణం అని అన్నారు. బాల్య వివాహమునకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టారని, ఆయన రచించిన కన్యాశుల్కము పుత్తడి బొమ్మ పూర్ణమ్మ ఎంతో ప్రజాదరణ పొందాయి. ఈ సందర్భంగా మొక్కల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర బిజెపి వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, డాక్టర్ ఎస్. శ్రీ లక్ష్మి, టి.గిరిజ, ఎస్.మహేష్, 29వ వార్డు బీజేపీ అభ్యర్థి పల్లా చలపతిరావు, సిఎం. రమణ, గేదెల శ్రీహరి, మంగ, బంగారమ్మ, చిలకమ్మా మొదలగువారు వారు పాల్గొన్నారు.

## నకిలీ చెక్కుల' పై ఏసీబీ విచారణకి సీఎం ఆదేశాలు !



ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించి నకిలీ చెక్కుల ఘటనపై సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫైర్ అయ్యారు. నకిలీ చెక్కులు జారీచేసిన ముఠాతోపాటు దాని వెనుక ఉన్న అదృశ్య శక్తుల నిగ్గుతేల్చాలని సీఎం జగన్ నిర్ణయించారు. దీనిపై ఏసీబీతో వెంటనే విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని అధికారులకి ఆదేశాలు జారీచేశారు. ఏపీకి చెందిన సీఎంఆర్ ఎఫ్ నిధులను కొల్లగొట్టేందుకు ఒకేసారి న్యూఢిల్లీ కోల్కత కర్ణాటక నుంచి వేర్వేరు కంపెనీల పేరుతో నకిలీ చెక్కులు జారీ చేయడం వెనుక పెద్ద ముఠా ఉండి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. వీటిని ఈ ముఠానే ముద్రించిందా లేక ఇందుకు బ్యాంకు సీఎంఆర్ ఎఫ్ విభాగాల్లోని వారు ఎవరైనా సహకరించారా.. అనేది కూడా తేల్చనున్నారు. అద్వైతా వీకే హాలో బ్లాక్స్ అండ్ ఇంటర్ లాక్స్ మల్లాబ్ పూర్ పీపుల్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ శర్మ ఫోర్జింగ్ పేర్లతో ఈ నకిలీ చెక్కులు జారీ అయ్యాయి. సీఎంఆర్ ఎఫ్ నుంచి రూ.117 కోట్లు కొల్లగొట్టేందుకు ఈ దారుణానికి ఒడిగట్టారు. దీనిలో భాగంగా కర్నాటక ఢిల్లీ కోల్కతా కు చెందిన ముగ్గురు వ్యక్తులు మంగళూరు మూడ్ బద్రి శాఖ లో రూ.52.65 కోట్లు ఢిల్లీ లోని సిసిపిసిఐ కి రూ.39.85 కోట్లు కోల్కతా సర్కిల్ లోని మెగ్ రాహత్ శాఖ లో రూ.24.65 కోట్ల విలువైన చెక్కులను వేశారు. క్లియరెన్స్ సమయంలో ఆంధ్రప్రదేశ్ లోని వెలగపూడి శాఖకు అక్కడి శాఖ అధికారులు ఫోన్ చేయడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కాగా సీఎంఆర్ ఎఫ్ చెక్కుల పేరిట భారీగా నగదు విత్డ్రా చేసేందుకు గుర్తుతెలియని వ్యక్తులు పన్నిన పన్నాగంపై ఆదివారం గుంటూరు జిల్లా తుళ్ళూరు పోలీస్స్టేషన్లో కేసు నమోదైంది. సచివాలయం రెవెన్యూ విభాగం అసిస్టెంట్ సెక్రటరీ పి.మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు తుళ్ళూరు-1 సీఐ ధర్మేంద్రబాబు కేసు నమోదు చేశారు.

## అక్టోబర్ 5 నుండి అక్టోబర్ 8 వరకు జెఎన్‌యుఇఇ 2020 పరీక్షలు



**ఢిల్లీ:** జాతీయ పరీక్షా సంస్థ (ఎన్‌టిఎ) ఆదివారం (సెప్టెంబర్ 20) జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష (జెఎన్‌యుఇఇ 2020) తేదీలను ప్రకటించింది. ఆన్‌లైన్ పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల ఆధారంగా ఉంటుంది మరియు ఇది అక్టోబర్ 5 నుండి అక్టోబర్ 8 వరకు రెండు షిఫ్టులలో నిర్వహించబడుతుంది - ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 3 గంటలనుంచి 6 గంటల వరకు విద్యార్థులు తమ అధికారిక కార్డులను తన అధికారిక వెబ్‌సైట్- https://jnuexams.nta.nic.in/ నుండి సెప్టెంబర్ 21, 2020 సోమవారం నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టిఎ తెలిపింది.

(మొదటిపేజి తరువాయి)



విద్యా ర్థులు సైతం పక్క విద్యార్థులకు దూరంగా సోషల్ డిస్టెన్స్ పాటిస్తూ కూర్చోవాల్సి ఉంటుంది. అదే విధంగా ఎప్పటికప్పుడు శానిటైజేషన్ కూడా నిర్వహించాల్సి ఉంటుంది. కరోనా నిబంధనల మేరకు తరగతుల్లో ఉపాధ్యాయులు అనుసరించిన విధానాలను, బాధ్యతలను స్పష్టంగా చెప్పిన విద్యాశాఖ, ఉపాధ్యాయులు అటు ఆన్లైన్ ద్వారా తరగతులు నిర్వహించడానికి, స్కూల్ కి వచ్చిన విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి తగిన విధంగా షెడ్యూలు కూడా రూపొందించింది. రోజు విడిచి రోజు ఉపాధ్యాయులు విధులకు హాజరు కావాల్సి ఉంటుందని, కొన్ని చోట్ల వారంలో మూడు రోజుల చొప్పున హాజరయ్యేందుకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విద్యార్థుల్లో ఎవరికైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తమై వైద్య శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఇక స్కూల్ కు విద్యార్థులు వచ్చి చదువుకునే దానికంటే, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆన్లైన్ ద్వారా చదువుకునే విద్యార్థులపై కూడా దృష్టిపెట్టాల్సిన బాధ్యత టీచర్స్ పై ఉంది. ఒకపక్క కరోనా నిబంధనలు పాటించడం, మరోపక్క విద్యార్థుల పై శ్రద్ధ పెట్టడం వంటి టాస్క్ లతో ఏపీలో స్కూల్స్ పునః ప్రారంభం అయ్యాయి. ఈ క్రమంలో నేడు బడి గంట మోగింది.

## విశాఖకు పరిపాలన రాజధాని ఉత్తరాంధ్ర ప్రజల హక్కు




**విశాఖపట్నం, పశ్చిమం, వార్తావళి, సెప్టెంబర్ 21:** విశాఖకు పరిపాలన రాజధాని కోసం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 4రోజులుగా ఉత్తరాంధ్ర ప్రజా ఆకాంక్ష దీక్ష చేస్తున్న వాసుపల్లి జానకిరామ్ కి మద్దతు తెలిపి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప జేయించిన విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త లిశ్రీ కె.కె రాజు గారులి మరియు విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ మళ్ళ విజయప్రసాద్ గారు ఈ సందర్భంగా శ్రీ కె.కె రాజు గారు మాట్లాడుతూ శ్రీ వై.యస్ జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన నాటినుండి ఉత్తరాంధ్రను అభివృద్ధి పరచాలి ఉత్తరాంధ్ర ప్రజలు సౌమ్యులు ఎవరినైనా స్వాగతిస్తారు అభివృద్ధి కాక్షిస్తారు విశాఖపట్నంను పరిపాలనా రాజధానిగా చేయటం ద్వారా ఇక్కడ అందరి సహకారంతో ఈ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానికంగా ఉన్న అందరికి ఉద్యోగాలు వస్తాయని మంచి ఆలోచనలతో విశాఖపట్నంను ప్రపంచంలో నంబర్-1 నగరంగా అభివృద్ధి చేయాలని మన జగన్మోహన్ రెడ్డి గారు కంకనబద్ధులు అయి ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, వార్డు అభ్యర్థులు,వార్డు అధ్యక్షులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడాభివృద్ధి పనులను పరిశీలించిన జెసి వెంకటరావు



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 21:** జిల్లా కేంద్రంలో జరుగుతున్న క్రీడాభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ (ఆసరా, సంక్షేమం) జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. విజయనగరం పట్టణంలో జరుగుతున్న క్రీడలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన సోమవారం పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇండోర్ స్టేడియంను సందర్శించి, ఇక్కడ సుమారు రూ.6కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ రూ.6కోట్లలో రూ.3కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులని, రూ.25లక్షలు ఎంపి లేండ్స్ కాగా, రూ.75లక్షలు రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మంజూరు చేసిందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వర్రావు జెసికి వివరించారు. మిగిలిన రూ.2కోట్లను విఎంఆర్‌డిఏ మంజూరు చేసిందన్నారు. పనులన్నిటినీ త్వరగా పూర్తి చేసి, స్టేడియంను అన్ని వసతులతో సిద్ధం చేయాలని జెసి ఆదేశించారు. అనంతరం విజ్జీ స్టేడియంను జెసి సందర్శించారు. ఇక్కడ నిర్మితమవుతున్న స్పోర్ట్స్ స్కూలు భవనాలను పరిశీలించారు. స్పోర్ట్స్ స్కూలును రూ.20కోట్లతో ప్రతిపాదించడం జరిగిందని, ఇప్పటివరకు ప్రభుత్వం సుమారు రూ.60లక్షలు మంజూరు చేసిందని డిఎస్‌డిఓ తెలిపారు. ఈ నిధులతో పరిపాలనా భవనాన్ని, డార్మెటరీలను నిర్మించినట్లు తెలిపారు. వాటిని త్వరగా పూర్తిచేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీవాలని జెసి అన్నారు. అటవీశాఖ భూమిని వేరుచేస్తూ కంచెను నిర్మించాలని సూచించారు. అలాగే విజ్జీ స్టేడియం సుమారు 70 ఎకరాల్లో విస్తరించి ఉండాలని, మరోసారి పూర్తిగా సర్వే చేయించి, విస్తీర్ణాన్ని ఖరారు చేయాలని జెసి ఆదేశించారు. ఈ పర్యటనలో జెసి వెంట డిఎస్డిఓతోపాటుగా, ఎపి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యనారాయణరాజు, గణేష్ తదితరులు ఉన్నారు.

## సింహ వాహనంపై బ్రహ్మాండ నాయకుడు



**తిరుపతి:** అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం ఉదయం సింహవాహనంపై యోగ ముద్రంకిత స్వరూపంలో మలయప్పస్వామి భక్తులకు ఏకాంతంగా దర్శనం ఇచ్చారు. సింహం అంటే ముందుగా నరసింహ అవతారమే సాక్షత్కరిస్తుంది. భక్తుల మదిలో వెంకటాద్రి రాజసింహం మృగరాజుపై యోగ ముద్రంకిత స్వరూపంతో దర్శనమిచ్చారు. కాగా ప్రపంచాన్ని గజ గజలాడిస్తున్న కరోనా వ్యాప్తి నేపథ్యంలో తిరుమల చరిత్రలోనే ఏకాంతంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

## పది నిమిషాల్లో బియ్యం కార్డు



**రామచంద్రపురం రూరల్:** దరఖాస్తు చేసిన పదంటే పది నిమిషాల్లో ఓ మహిళ బియ్యం కార్డు అందుకుంది. ఏళ్ల తరబడి కాళ్లరిగేలా తిరిగినా రాని కార్డు.. ఇప్పుడు నిమిషాల్లో రావడంతో ఆమె ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. దీనికి కారణమైన వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం మొగుళ్లపల్లికి చెందిన దూపాటి అంజమ్మకు దశాబ్దాల కాలంగా రేషన్ కార్డు లేదు. ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయింది. ఆమెకు బియ్యం కార్డు లేదన్న విషయం తెలుసుకున్న వలంటీర్ శనివారం ఉదయం 11.28 గంటలకు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేయించాడు. సరిగ్గా 11.38 గంటలకు ఆమెకు బియ్యం కార్డును అందించారు. అలాగే వితంతు పింఛన్ కోసం, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం అర్జీ పెట్టిన అరగంటలో ఆ పత్రాన్ని అందుకుంది. ఆమె భర్త వెంకటేశ్వర్లు అనారోగ్యంతో ఈ నెల 14న మృతి చెందాడు. మరణ ధ్రువీకరణ పత్రం కోసం ఈ నెల 17న దరఖాస్తు చేయగా.. శనివారం వలంటీర్ ఇంటికి వెళ్లి సర్టిఫికెట్‌ను అందించాడు. అలాగే కృష్ణా జిల్లా తేలప్రోలుకు చెందిన కాటం ఓబేదు, మదిచెర్ల మేరీగ్రేస్, బొంతు జోజిబాబులు దరఖాస్తు చేసుకున్న పావుగంటలో బియ్యం కార్డు అందుకున్నారు.



దక్షిణ నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు, విఎంఆర్‌డిఏ మాజీ చైర్మన్ శ్రీ ద్రోణంరాజు శ్రీనివాస్ గారి ఆరోగ్యంగా కోలుకోవాలని.. సంపూర్ణ ఆయురారోగ్యాలతో తిరిగి మనందరితో కలసి కార్యక్రమాల్లో పాల్గోవాలని... ఈరోజు 34వ వార్డు వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ శ్రీ లింగం శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో అచ్చియమ్మ పేట వద్ద గల శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయంలో పూజలు నిర్వహించి,, బాబా గారికి 108 కొబ్బరికాయలు సమర్పించడం జరిగింది.. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు.. గరికిన సురేష్ గారు ... కదిరి. గురుమూర్తి గారు,సురడా. మసేను గారు, బడే. వెంకట రావుగారు,పల్లేటి. పార్వతి గారు, పాన్ షాప్ పద్మ గారు, చిట్టెమ్మ గారు, నారాయణమ్మగారు, సిటీ మహిళా జనరల్ సెక్రటరీ రీసు. అనురాధ గారు.. వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

**- అర్జా రాజేష్, వార్తావళి ఫోటోగ్రాఫర్, విశాఖ దక్షిణం**

## అందుబాటులోకి కోవిడ్ -19 టీకా



మూడో దశ ప్రయోగాలు కొనసాగుతుండగానే టీకాను యూఏఈ అందుబాటులోకి తెచ్చింది. కరోనా వైరస్‌పై ముందుండి పోరాడుతున్న యోధులకు టీకా అందజేయాలని యూఏఈ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో తొలి విడత వ్యాక్సిన్ డోస్ అందుబాటులోకి వచ్చింది. యూఏఈ ఆరోగ్య శాఖ మంత్రి అబ్దుల్ రహ్మాన్ బిన్ మొహమ్మద్ అల్ ఓవైస్ వ్యాక్సిన్ తొలి డోస్‌ను తీసున్నారు. టీకా తీసుకున్న తర్వాత తనకు ఎటువంటి దుష్ప్రభావాలు సంభవించలేదని, ఈ కారణంగానే తాను డోస్ తీసుకున్నానని ఆయన వెల్లడించారు.

## రూ. 500, రూ. 2000 నోటు ముద్రణ ప్రారంభం



**ఢిల్లీ:** రూ. వెయ్యి, పాత రూ.500 నోట్ల రద్దు తర్వాత వచ్చిన రూ.2 వేల నోటు.. మొదట్లో చిల్లరకు ఇబ్బంది పెట్టినా.. ఆ తర్వాత బాగానే చలామణిలోకి వచ్చింది. ఇక, ఆ తర్వాత రూ.2 వేల నోటుపై రకరకాల వార్తలు వచ్చాయి.. ఆ నోట్ల ముద్రణ నిలిపివేసింది ఆర్బీఐ. ఈ నోటు కూడా బ్యాన్ చేస్తారా? అనే అనుమానాలు కూడా వ్యక్తం చేశారు.. అయితే.. దీనిపై క్లారిటీ ఇచ్చింది కేంద్రం.. రూ. 2 వేల నోటు ముద్రణను నిలిపివేసే అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్రం పార్లమెంట్‌లో ప్రకటించింది. ఆర్థిక శాఖసహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ లోక్‌సభలో ఓ ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. లావాదేవీలను సులభంగా నిర్వహించేందుకు వీలుగా బ్యాంకు నోట్ల ముద్రణపై ఆర్బీఐని సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అలాగే నోట్ల ముద్రణకు సంబంధించి దేశవ్యాప్త లాక్‌డౌన్ కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయినట్లు ఆర్‌బీఐ తెలిపిందని ఠాకూర్ వెల్లడించారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ముద్రణ ప్రక్రియ దశలవారీగా ప్రారంభమైందని తెలిపారు.



విశాఖ మన్యం పాడేరులో పాత బస్టాండ్ సమీపంలో ఉన్న కార్ షెడ్ వద్ద చెట్టు పడి ఒక్క కారు ఆటో ధ్వంసం. అయితే ఆసమయంలోలో రోడ్డు ఇటువంటి రద్దీ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే ఆటోలో ఉన్న ప్రయాణికులు తీవ్ర గాయాలు అవ్వడంతో హాస్పిటల్ కి తరలించారు. అంబేద్కర్ సెంటర్ వద్ద ట్రాఫిక్ జాం ఏర్పడింది.

**- వార్తావళి, పాడేరు**

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006